RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:214 బుధవారం 09 సెప్టెంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

## రణరంగంగా వరదరాజపూర్

- కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ
- కేసీఆర్, రేవంత్‌ల దిష్టిబొమ్మలు దహనం
- ఫామ్ హౌస్ పరిసరాల్లో పోలీస్ బందోబస్తు

2





## ఎర్రవల్లిలో హైటెన్షన్

- కాంగ్రెస్-బీఆర్ఎస్ శ్రేణుల బాహాబాహీ
- దామరకుంట వద్ద రాళ్ల దాడి, తోపులాట
- కేటీఆర్, హరీశ్ రావు ఎర్రవల్లి బాట
- మార్గమధ్యలో పోలీసుల అరెస్ట్, భారీ బందోబస్తు

3

## రేవంత్ రెడ్డిది క్రిమినల్ మనస్తత్వం

- సబిత, సునీతలపై దాడి హేయం
- ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి
- స్పీకర్‌ను అడ్డు పెట్టుకుని చిల్లర రాజకీయాలు
- రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటు విమర్శలు

2



### సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్ డిమాండ్
- సభలో చర్చను దారిమళ్లించేందుకే కాంగ్రెస్ చిల్లర డ్రామాలు

3

## కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి

- గౌరవ సభ కాదు.. కౌరవ సభ.. రాష్ట్రంలో పాలన గాడితప్పింది..
- లా అండ్ ఆర్డర్ మంటగలిసింది.. కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకోవాలి
- తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలి.. కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య
- రేవంత్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలి
- జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు

3



# బీఆర్ఎస్ సభ్యుల తీరు ప్రజాస్వామ్యానికే మచ్చ

- ఆయన్ను దళిత స్పీకర్ గా చూడటం తప్పు
- తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిని సహించేది లేదు
- చట్ట సభలపై దాడికి ఫామ్ హౌజ్‌లో కుట్ర
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- దామోదర్ ప్రతిపాదించిన తీర్మానానికి మద్దతు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, సెప్టెంబర్ 8:

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని, మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రతిపాదించిన తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ ఆయన మాట్లాడారు. సభాపతి స్థానంలో కూర్చున్న వ్యక్తి కేవలం ఒక వ్యక్తి కాదని, ఆయన సభ గౌరవానికి, స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతీక అని

మిగతా 2వ పేజీలో..



### వారి వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధం

- శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి దామోదర్
- మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలకు రంగం సిద్ధం

2

### బీఆర్ఎస్ లీడర్ల ప్రవర్తన సిగ్గుచేటు

- కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి
- బీఆర్ఎస్ సభ్యులపై చర్యల కోసం సభాపతికి విజ్ఞప్తి

2



### స్పీకర్‌ను దూషించి మాట మారుస్తున్నారు

- నిన్నటి ఘటనపై వాస్తవాలు బయటకు రావాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

2





### ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంపు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శితో భేటీ


2

### రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప చావు కోరుకోవడమేంటి?

- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

3

## తిట్టింది నా తల్లిని.. నీకెందుకు ఆగ్రహం?



- హరీశ్‌రావుపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం
- సీనియర్ సభ్యుడిగా మాట్లాడిన తీరు బాగాలేదని వ్యాఖ్య
- తన తల్లిని తిట్టినందుకు ఆగ్రహం ఉందన్న గడ్డం ప్రసాద్‌కుమార్
- 'నీ తల్లిని తిట్టనప్పుడు నీకెందుకు ఆగ్రహం?' అంటూ నిలదీత
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై నివేదిక కోరిన స్పీకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 8:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ బయట చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు

మిగతా 3వ పేజీలో..

### స్పీకర్‌కు సీఎం రేవంత్ పరామర్శ

- నిన్న అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో ..

3



### ఫీజు బకాయిల విడుదలకు ఆదేశాలు ఇవ్వాలి



2



### బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

- తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

3



### ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

- ఆ నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు 10న ఆఖరు
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం

హైదరాబాద్, సెప్టెంబరు 8 :

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించనున్న 'టవర్స్'లో ఇండ్ల

మిగతా 3వ పేజీలో..

# బీఆర్ఎస్ లీడర్ల ప్రవర్తన సిగ్గుచేటు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

శాసనసభ సమావేశాల సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులపై బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు, శాసనసభ, శాసనమండలిసభ్యుల ప్రవర్తనను, వారుఉపయోగించిన అవమానకరమైన పదజాలాన్ని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాసన సభలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులే మహిళా పోలీసుల ఆత్మగౌరవాన్ని గాయపరిచేలా వ్యవహరించడం సభ్యసమాజం తలదించుకోవాల్సిన పరిణామమని ఆవేదన వ్యక్తం చేశారు. చొక్కాలు విప్పి విధి నిర్వహణలో ఉన్న యువ మహిళా కానిస్టేబుళ్లపైకి రావడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందన్నారు. మానవత్వం తరపున ఆ మహిళా పోలీసులకు తాను క్షమాపణ చెబుతున్నానంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజాస్వామ్యంలో విమర్శించే స్వేచ్ఛ ఉంది కానీ మహిళలను అవమానించే, సభాపతి పీఠాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదని, ప్రభుత్వ సహనాన్ని చేతగానితనంగా భావించవద్దని స్పష్టం చేశారు. సభా గౌరవాన్ని, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అనుచితంగా ప్రవర్తించిన బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ దృఢమైన, కఠినమైన నిర్ణయం తీసుకోవాలని పద్మావతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**నగరపర్యటనలను అన్వేషించండి**

**మహిళా కమిషన్‌కు ఫిర్యాదు**

పోలీసులుగా విధులు నిర్వర్తిస్తున్న యావత్ మహిళా సిబ్బంది ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిపై మహిళా ప్రజా ప్రతినిధులతో కలిసి మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

**సభాపతి గౌరవాన్ని దిగజార్చారు**

సభాపతి పీఠంతోపాటు ముఖ్యమంత్రి, మంత్రులపై బీఆర్ఎస్ నేతలు హేయమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మైక్‌లో రికార్డు కాలేదనే సాంకేతిక కారణంతో వదిలేయకుండా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పద్మావతి రెడ్డి సభాపతిని డిమాండ్ చేశారు.

## స్పీకర్‌ను దూషించి

# మాట మారుస్తున్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనలకు సంబంధించి వాస్తవాలు బయటకు రావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. శాసనసభలో మంగళవారం ఆమె మాట్లాడుతూ స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారు. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రాజకీయాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. పొట్టకూటి కోసమో, లేక ప్యాషన్‌తోనో మహిళలు పోలీసులు అయితే వారిపై చేతులు వేసి అవమానపరుస్తారా అని నిలదీశారు. మహిళా పోలీసుల మీద కేటీఆర్ చేతులు వేశారంటూ కావాలంటే విజువల్స్‌ను సభకు సమర్పిస్తానన్నారు. మహిళా పోలీసుల మీద చేతులు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో రభస దేనికి అని ప్రశ్నించారు. సొంత ఇంటి ఆడబిడ్డ కవితను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారో వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. శాసనమండలిలో మంత్రి సీతక్క మాట్లాడుతూ బీఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగారు. స్పీకర్‌ను దూషించిన వారిని సభ నుంచి బహిష్కరించాలన్నారు. మహిళా పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేతులు వేసి నెట్టివేశారని, దీనిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తే విచారణ జరిపి చర్యలు తీసుకోండన్నారు. గిరిజన, దళిత వ్యతిరేక నైజం మీదేనని, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాలు ఎదిగితే ఓర్చుకోలేని భూస్వామ్య విధానం బీఆర్ఎస్ దని అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కేటీఆర్ మహిళా పోలీసులపై చేతులు వేశారని ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ వ్యక్తులను దూషిస్తే యాక్ట్ వర్తిస్తుందన్నారు. వీళ్లకు తల్లులు లేరా.. వీళ్ల తల్లులను తిడితే వారు బాధపడరా అని అడిగారు. 2018లో స్పీకర్‌పై దాడి చేశారని నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆర్టికల్ 194(3) ప్రయోగించి సస్పెండ్ చేశారు.. అదే రూల్ బీఆర్ఎస్ సభ్యులకు వర్తింప చేయాలన్నారు. అసెంబ్లీలో హరీష్ రావు స్పీకర్ పోడియం మీదకు ఉరుకుతున్నారంటూ ఏం.. స్పీకర్ ను కొడుతరా అని సీతక్క ప్రశ్నించారు. ని నైతిక విలువలు ఉండాలి.. సభ సంప్రాదాయాలు ఉండాలి.. ఇప్పటివరకు స్పీకర్‌కు క్షమాపణ చెప్పలేదు.. బీఆర్ఎస్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నా అని మంత్రి సీతక్క అన్నారు.

**గాయపడ్డ మహిళా పోలీసులకు పరామర్శ**

అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన తోపులాటలో గాయపడిన మహిళా పోలీసులను మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించారు. ఘటన పూర్తి వివరాలను మంత్రికి మహిళా పోలీసు అధికారులు వివరించారు. కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారంటూ ఆ విజువల్స్ చూపి మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేశారు. టీ షర్టులు విసిరేసి మీదిమీదికి వచ్చారని, విధి నిర్వహణలో చాలా ఇబ్బందులు పడ్డామని మంత్రికి వివరించారు. తాము అధికారంలోకి వచ్చాక అంతు చూస్తామని బీఆర్ఎస్ నాయకులు బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఫొటోలు, విజువల్స్ చూసి తమ కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని మహిళా పోలీసులు తెలిపారు. ఇలాంటి డ్యూటీలు చేయాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తున్నదన్నారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మహిళా పోలీసులకు మంత్రి సీతక్క ధైర్యం చెప్పారు. మీ డ్యూటీ మీరు చేయండి.. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# రేవంత్ రెడ్డిది క్రిమినల్ మనస్తత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై అత్యంత హేయమైన దాడి అని, వారికి జరిగిన ఈ అవమానానికి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై జరిగిన దాడికి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. క్రిమినల్ మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రి తెలంగాణకు రావడం ప్రజల దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. మహిళా నాయకులను చుట్టుముట్టి లాగడం, గొంతు పట్టుకోవడం, చీర లాగడం ద్వారా దుశ్శాసన పర్వానికి తెరలేపారన్నారు. ప్రభుత్వ తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు స్పీకర్‌ను అడ్డం పెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఎమ్మెల్సీ స్పష్టం చేశారని, స్పీకర్ బాధపడి ఉంటే వ్యాఖ్యలను ఉపసంహరించుకుని విచారం వ్యక్తం చేశారని తెలిపారు. కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ గూండాలను ప్రభుత్వం పోలీసు ఎస్కార్ట్‌తో పంపిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాధన కోసం 14 ఏళ్ల ఉద్యమం చేసిన కేసీఆర్ చావాలని ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. రైతుబంధు ద్వారా 70 లక్షల మంది రైతులకు కేసీఆర్ అండగా నిలిచారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయడం, బహిష్కరించడం ద్వారా వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థలపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి అరెస్టు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు టార్గెట్ కేసీఆర్ లేదా ఎమ్మెల్సీలకు పదవులు లేకుండా చేయడమేనన్నారు. నిషేధిత జాబితా భూములు, విద్యార్థుల రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్చకు డిమాండ్ తమను అడ్డుకునేందుకు పోలీసులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

**ప్రజలకు అండగా నిలిచిన కేసీఆర్**

కేసీఆర్ హయాంలో కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్ల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని, హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల ఆకాంక్షలను నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా కేటీఆర్ అభివర్ణించారు. 420 హామీలు ఇచ్చి వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిన హామీలపై నిలదీశారు.

# బీఆర్ఎస్ సభ్యుల తీరు ప్రజాస్వామ్యానికే మచ్చ

**మొదటిపేజీ తరువాయి**

పేర్కొన్నారు. సభాపతిని అవమానించడమంటే మొత్తం సభను అవమానించడమేనన్నారు. ఇది సభా ధిక్కారానికి సమానమన్నారు. సభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అన్ని పార్టీల సభ్యులు ఎన్నుకున్నారని, ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టి సభను నడిపించే బాధ్యత అప్పగించారని గుర్తు చేశారు. ఆయన దళిత వర్గం నుంచి ఎదిగి వచ్చిన వ్యక్తి కావడం అదనపు గౌరవానికి కారణమని, అయితే ఆయనను దళిత స్పీకర్‌గా మాత్రమే చూడటం సరికాదని, ఆయన మొత్తం శాసనసభకు స్పీకర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇంకా తమ పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మర్చిపోలేదనడానికి ఈ సంఘటనే సజీవ సాక్ష్యమన్నారు. దళిత వర్గం నుంచి వచ్చి సభాపతి స్థానంలో కూర్చున్న ప్రసాద్ కుమార్ ను గౌరవించకపోవడం ఆ పార్టీ నైజానికి అద్దం పడుతోందన్నారు. సభలో జరిగిన రచ్చ ఆషామాషీగా జరిగింది కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు ఫామ్ హౌస్ లో బీఆర్ఎస్ ఎల్పీ మీటింగ్ జరిగిందని, ఆ ఫామ్ హౌస్ కుట్రలో ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు పథక రచన చేశారని ఆరోపించారు. కుట్రదార్లు నడిపించిన రోల్ ప్లేయర్లుగా కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ప్రవర్తించారని, ప్రధాన సూత్రధారులు బీఆర్ఎస్ అత్యున్నత నాయకత్వమేనని అన్నారు. సభలో టీషర్టులు, నల్ల చొక్కాలు ధరించి వాటిపై నినాదాలు రాసుకుని రావడాన్ని కూడా భట్టి తప్పుబట్టారు. సభలో బ్యాడ్జీలు, ప్రదర్శనాత్మక గుర్తులు ధరించరాదనే నిబంధనలు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపొందించిన రూల్ బుక్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. మీ ప్రభుత్వమే రూపొందించిన నిబంధనలను అమలు చేస్తున్న సభాపతిపై బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయడం విడ్డూరమని అన్నారు. నిబంధనలు అమలు చేసినందుకే సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సభాపతి తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం దళిత వర్గాలకు సంబంధించిన అంశం కాదని, తెలంగాణ సమాజం సంస్కారం, సంస్కృతి, మహిళల పట్ల గౌరవానికి సంబంధించిన సమస్య అని అన్నారు. తాను గతంలో పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చున్న విషయాన్ని గుర్తు చేశారు. మైక్ ఇవ్వకపోయినా, సభలోకి రావడాన్ని అడ్డుకున్నా ప్రజాస్వామ్యాన్ని, సభాపతి స్థానాన్ని గౌరవించామని అన్నారు. బీఆర్ఎస్ విధానం ప్రజాస్వామ్య స్ఫూర్తినే దెబ్బతీసేలా వుందన్నారు. ఇలాంటి కుట్రదారులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని అన్నారు. ఫామ్‌హౌస్ కుట్రను శాసన సభ పూర్తిగా ఖండించాలని కోరారు. సభాపతిపై జరిగిన ఘటన తర్వాత కూడా బీఆర్ఎస్ నేతలు పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోవడం మరింత బాధాకరమని అన్నారు. సభలో మళ్లీ సభాపతి స్థానాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం, ఆగ్రహంతో ముందుకు దూసుకెళ్లే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రజాస్వామ్యంపై, తెలంగాణ ఆత్మగౌరవంపై, సామాజిక సమానత్వంపై దాడి చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కులాలు, మతాలు, వర్గాల మధ్య ఐక్యతను కాపాడుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో ఇలాంటి విభజనాత్మక రాజకీయాలకు తావివ్వకూడదన్నారు.

# వారి వ్యాఖ్యలు సభా మర్యాదలకు విరుద్ధం

- **సభాపతిని కించపరిచిన ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలి**
- **శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి దామోదర్**
- **మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలకు రంగం సిద్ధం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

శాసనమండలిలో బీఆరఎస్ సభ్యులు తాతా మధుసూదన్, ఎన్.నవీన్ కుమార్ రెడ్డిలు శాసన సభ ప్రాంగణంలోని గేట్ నంబర్ 3 సమీపంలో శాసనసభాపతిని ఉద్దేశించి అత్యంత అవమానకరంగా, కించపరిచేలా చేసిన దూషణలను ఈ సభ తీవ్రంగా ఖండిస్తున్నదంటూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శాసన సభలో మంగళవారం తీర్మానం ప్రవేశ పెట్టారు. సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన నమోదు చేస్తోందని అన్నారు. ఈ ఇద్దరు సభ్యులు మహిళల ఎదుట చొక్కాలు విప్పి అనుచితంగా, అసభ్యకరంగా, సమాజం తలదించుకునేలా ప్రవర్తించడాన్ని కూడా ఈ సభ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి ప్రవర్తన శాసన మండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదని, గౌరవ శాసన సభాపతి గౌరవం, అధికారం రాజ్యాంగబద్ధ హోదాకు తీవ్ర భంగం కలిగించిందని ఈ సభ భావిస్తోందని పేర్కొన్నారు. ఇది శాసనసభ గౌరవం, సభా హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కలిగించే చర్యగా ఈ సభ పరిగణిస్తోందన్నారు. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఏవైనా సరే సభాపతి హోదాలో ఉన్న వ్యక్తి గౌరవాన్ని, అధికారాన్ని తగ్గించే ఉద్దేశంతో సభ్యులు ప్రవర్తించడాన్ని సమర్థించబోమని ఈ సభ స్పష్టం చేస్తోందని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటాన్ని సహించేది లేదని సభ అభిప్రాయపడుతున్నదన్నారు. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావు బాధ్యత స్వీకరించి ఈ సభ హుందాతనం, సభా మర్యాదలను పరిరక్షించేందుకు శాసన సభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సభ తీర్మానిస్తోందన్నారు. మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డిలు ప్రస్తుతం శాసన మండలి సభ్యులుగా ఉన్నందున ఈ తీర్మానం ప్రతితోపాటు సభ ముందు ఉంచిన ఆధారాలు, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు, వాటికి సంబంధించిన కార్యకలాపాల వివరాలను శాసనమండలి చైర్మన్‌కు పంపించాలని ఈ సభ తీర్మానిస్తోందని తెలిపారు. ఈ అంశంపై శాసన మండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలని ఈ సభ తీర్మానిస్తున్నట్లు మంత్రి దామోదర్ తీర్మానంలో పొందుపరిచారు.

# రణరంగంగా వరదరాజపూర్

**మర్కుక్, సెప్టెంబర్ 8 :**



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరదరాజపూర్, ఎర్రవల్లి గ్రామాల్లో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి.మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ముట్టడికి కాంగ్రెస్ నేతలు భారీగా తరలిరావడంతో రాజకీయంగా హై టెన్షన్ వాతావరణం ఏర్పడింది. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట సర్సారెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పు చప్పుళ్ల,జై కాంగ్రెస్ నినాదాలతో ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు ర్యాలీతో ముట్టడికి బయలుదేరారు. ఎమ్మెల్సీ తాతా మధు ఇటీవల చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ముందస్తు సమాచారం అందడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. మర్కుక్, ఎర్రవల్లి, వరదరాజపూర్ పరిస రాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను వరదరాజపూర్ శివారులోనే అడ్డుకున్నారు.పోలీ సులు అడ్డుకోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.పో లీసులకు,కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తోపులాట, తీవ్ర వాగ్వాదం చోటుచే సుకుంది. అదే సమయంలో వరదరాజపూర్ గ్రామం రాజకీయ రణరం గంగా మారింది. బిఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ గా పరిస్థితి మారిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు దగ్ధం చేశారు. దీనికి ప్రతీకారంగా కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. ఒకరిపై ఒకరు పరస్పర నినాదా లతో గ్రామం దద్దరిల్లింది. పరిస్థితి చేయిదాటకుండా పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిసరాల్లో 144 సెక్షన్ వాతావరణం నెలకొంది.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 :**

తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను గణనీయంగా పెంచడంతోపాటు ఫిలిప్పీన్స్-తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి (క్యాబినెట్ మంత్రి హోదా) ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో మంగళవారం సమావేశమయ్యారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని, నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేసే సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. దీనిపై స్పందించిన ఫిలిప్పీన్స్ కార్యదర్శి లారెల్.. తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున బియ్యం దిగుమతి చేసుకునే అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. బియ్యంతోపాటు తెలంగాణ నుంచి నాణ్యమైన విత్తనాలు, మాంసం ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంపై కూడా ఫిలిప్పీన్స్ ప్రతినిధులు ఆసక్తి చూపారు. కొనుగోలు విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, రవాణా, శానిటరీ నిబంధనలపై ఇరు దేశాల అధికారులు, పరిశ్రమ ప్రతినిధుల భాగస్వామ్యంతో త్వరలోనే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు.

**తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్'కు హాజరు కావాల్సిందిగా ఫ్రాన్సిస్కో లారెల్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడం వల్ల రాష్ట్రంలోని రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన రంగానికి తీవ్ర ప్రయోజనం చేకూరుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# ఫీజు బకాయిల విడుదలకు ఆదేశాలు ఇవ్వాలి

- **గవర్నర్‌కు బీజేపీ ప్రతినిధి బృందం వినతి**
- **అసెంబ్లీలో ఒక్క రోజైనా ఫీజు బకాయిలపై చర్చ జరపాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బీజేపీ ప్రతినిధి బృందం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది. గవర్నర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలన నుంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. హైకోర్టు చీవాట్లు పెట్టడంతోపాటు బీజేపీ చేపట్టిన నిరంతర ఆందోళనలు, నిరసన కార్యక్రమాల వల్లే ఈ విద్యాసంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులకు నామమాత్రంగా అయినా నిధులు మంజూరయ్యాయని, అయితే దాదాపు రూ.15వేల కోట్ల పాత బకాయిలు విడుదల కాకపోవడంతో లక్షలాదిమంది విద్యార్థులకు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు అందక భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు రాకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు లెక్చరర్లు, ప్రొఫెసర్లకు సగం జీతాలతోనే నడిపిస్తున్నాయని, దీనివల్ల రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా విద్యా వ్యవస్థను ఇలా నిర్వీర్యం చేయడంపై రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను కాపాడేందుకు ఫీజు బకాయిలను విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, తగిన సలహాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకునేలా సలహా ఇస్తానని హామీ ఇచ్చారని వెల్లడించారు. అలాగే శాసనసభలో జరుగుతున్న పరిణామాలపై రామచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలే కారణమని, అందుకే ఆ పార్టీలు కుమ్మక్కై ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ప్రజలకు సంబంధం లేని అంశాలపై మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కనీసం ఒక్క రోజైనా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీఛార్జీలు, ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. నిన్నటి ఆందోళనలో పోలీసుల దాడితో తీవ్రంగా గాయపడి పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు హాస్పిటల్స్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామని, ప్రభుత్వ స్పందన కోసం కొన్ని రోజులు వేచి చూస్తామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని రామచందర్ రావు హెచ్చరించారు. గవర్నర్‌ను కలిసిన బృందంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, టి.వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయశ్రీ, డాక్టర్ కళ్యాణ్ నాయక్, రాష్ట్ర కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, భరత్ ప్రసాద్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందేలతోపాటు నిన్నటి ఆందోళనలో పోలీసుల లాఠీచార్జిలో గాయపడిన యువమోర్చా కార్యకర్తలు ఉన్నారు.

# కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

కలియుగ దుశ్శాసనుడు రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ ఎల్పీ ఉప నాయకుడు టి.హరీష్‌రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలపై సోమవారం దాడి జరిగితే ఎందుకు చర్చ చేయడం లేదు... ఎందుకు మహిళా ఎమ్మెల్యేలకు మైకులు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. ఆనాడు ద్రౌపది పట్ల వ్యవహరించిన తీరు గుర్తు చేస్తున్నదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పుకోవడానికి అసెంబ్లీలో వారికి అవకాశంగా ఇవ్వడం లేదంటూ గౌరవ సభను రేవంత్‌రెడ్డి కౌరవ సభగా చేశాని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరగలేదని స్పీకర్ ఎలా అంటారు అంటూ యావత్ దేశం చూసింది.. మీడియాలో వచ్చింది అన్నారు. ఫిర్యాదు ఇస్తే నమోదు కాలేదు.. దాడి జరిగిన సునీతమ్మ, సబితమ్మ, కోవా లక్ష్మిపై ఉల్టా కేసు పెట్టారు అని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడం అంటే ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటె అన్నట్లేనన్నారు. రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నడన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగి, గొంతు నులిమి అరెస్టులు చేసి రేవంత్ వికృతానందం పొందుతున్నడన్నారు. స్పీకర్ మీద కావాలని అనలేదంటూ అయినా అందుకు మధు క్షమాపణలు చెప్పారన్నారు. బీజేపీ వాళ్లు ప్లకార్డులు తీసుకు వెళ్తే అడ్డుకోరు.. తాము టీ షర్టులు వేసుకుంటే అడ్డుకుంటరు.. బీజేపీ, కాంగ్రెస్ బంధం ఇదే కదా అని నిలదీశారు. బడివే అని, తంతం అని అసెంబ్లీల్లో అంటే అది వికృత భాష కాదా ప్రశ్నించారు. తాము ఆరు గ్యారెంటీల గురించి అడిగితే వికృత భాషనట.. మొన్న పాలిటిటక్నిక్ విద్యార్థుల గొంతు నులిమారు.. నిన్న సబితమ్మ గొంతు పట్టుకున్నారు.. నేడు తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఇంటిపైకి దాడికి ఉసిగొల్పారు అని ఆరోపించారు. రోప్ పార్టీ ఇచ్చి, ఎస్కార్ట్ ఇచ్చి దగ్గరుండి దాడికి ప్రోత్సహించారన్నారు. హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి.. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగినదానికి క్షమాపణ చెప్పాలి.. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపై దాడి జరిగిందానికి క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో లేదు.. అన్ని వర్గాలపై దాడులు జరుగుతున్నాయి అని మండిపడ్డారు. నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కేంద్రం జోక్యం చేసుకోవాలని, రాష్ట్రపతి పాలన పెట్టాలి అని గవర్నర్‌ను కోరుతున్నామని హరీష్‌రావు చెప్పారు. రాహుల్ గాంధీ.. మీరు ఎందుకు మాట్లాడటం లేదు.. లా అండ్ ఆర్డర్ చేతుల్లోకి తీసుకుని గూండాల్లాగా ప్రవర్తిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని చేతులో పట్టుకుని ఉండే నువ్వు ఇక్కడ జరుగుతున్న రాజ్యాంగ భక్షణ కనిపించడం లేదా అని నిలదీశారు. కేటీఆర్, యాదవ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సంజయ్, నాకు అందరికీ దెబ్బలు తాకాయి.. తాము పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తీసుకోవడం లేదు.. చేతులో అధికారం ఉందని, మందబలం ఉందని ఇష్టం ఉన్నట్లు వ్యవహరిస్తే కౌరవులకు పట్టిన పరిస్థితే మీకు ఉంటుంది అని హరీష్‌రావు హెచ్చరించారు. షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్ చావాలని అనడం దారుణమన్నారు. వెంటనే ఆయనపై తీర్మానం పెట్టి ఆయన సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సభలో ముఖ్యమంత్రి తర్వాత ఆ స్థానం ప్రతిపక్ష నాయకుడిది. అలాంటి నాయకుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోరు అని స్పీకర్‌ను అడిగారు. ఇదేం ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. 119మంది ఎమ్మెల్యేలను సమానంగా చూడాలి కానీ ఎందుకు ఏపక్షంగా వ్యవహరిస్తున్నారని అడిగారు. రెండు రోజులు ప్రజల సమస్యలపై చర్చ లేకుండా సభా సమయాన్ని వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మిమ్మల్ని వదిలిపెట్టదని, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉంటాం.. మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాం అని ఆయన హెచ్చరించారు. సభలో చర్చ జరిగితే వైఫల్యాలు బయట పడుతాయని చర్చ జరగకుండా ప్లాన్ చేసిండు అన్నారు. ఈ చేతగాని దద్దమ్మ సీఎం వల్ల ఇక్కడ క్రాప్ హాలిడే యూరియా యాపులు పెట్టి ప్రజల ఉసురు పోసుకుంటున్నారు.. నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి.. కరెంట్ ఇవ్వలేక చేతులు ఎత్తుతున్నారు.. కేసీఆర్ పాలనలో ఈ సమస్యలు లేవు.. మీరు రాగానే ఎందుకు మొదలయ్యాయి అని హరీష్‌రావు ప్రశ్నించారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, ఉద్యోగులు పీఆర్సీ, డీఏ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కరోనా ఉన్నా పెద్ద నోట్ల రద్దు ఉన్నాక కేసీఆర్ రూ.20వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేశారు అని చెప్పారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని, 22ఎ పెట్టి రాత్రికి రాత్రి పేదల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజల గుండెపై బండ వేశారని అన్నారు. నాలుగు వేల పింఛన్ ఏమైంది.. పెంచుతానన్న రైతు భరోసా ఏది అని రైతులు అడుగుతున్నారు.. వెయ్యి రోజులు అయినా నీ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు.. బకాయిలతో సహా చెల్లించాలని ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

**హకీంపేట్ వద్ద హరీష్ రావు, ఇతర ఎమ్మెల్యేల అరెస్ట్**

కేసీఆర్‌కి రక్షణగా వెళ్తున్న తమను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు పీకలదాకా తాగి కేసీఆర్ ఇంటిపై దాడికి వెళ్తున్న కాంగ్రెస్ గూండాలకు, ఎమ్మెల్యేలకు మాత్రం పైలట్ ఎస్కార్ట్ ఇచ్చి మరీ పంపుతున్నారు.. అసలు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు అడిగారు. కేసీఆర్ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి వెళ్తున్నారన్న సమాచారంతో ఆయనకు రక్షణగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీఆర్ తదితరులను మేడ్చల్ మల్కాజిగిరి కమిషనర్ సుమతి ఆధ్వర్యంలో పోలీసులు హకీంపేట వద్ద హరీష్‌రావు, ఇతర ఎమ్మెల్యేలను అరెస్టు చేసి జవహర్‌నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్కడ విలేకరులతో హరీష్‌రావు మాట్లాడారు. నిన్నటికి నిన్న మహిళా ఎమ్మెల్యేల గొంతులు పిసికి, చీరలు లాగిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈరోజు తెలంగాణ సాధించిన నాయకుడు, పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటిపైకే దాడికి పంపింది.. స్వయంగా హోంమంత్రి శాఖను కూడా తన చేతిలోనే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే దగ్గరుండి ఈ దాడి చేయిస్తున్నారు అని హరీష్‌రావు ఆరోపించారు. రాజ్యాంగం పుస్తకం చేతిలో పట్టుకుని తిరుగుతూ ప్రజాస్వామ్యం గురించి పోజులు కొట్టే రాహుల్ గాంధీని నేను సూటిగా అడుగుతున్నాను.. మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ అప్రజాస్వామిక చర్యలను, దాడులను సమర్థిస్తావా.. మీరు ప్రజలకు ఇచ్చిన ఏడవ గ్యారెంటీ ఇదేనా రాహుల్ గాంధీ అని ప్రశ్నించారు. ఆనాడు అస్సాం ముఖ్యమంత్రి నీ పుట్టుకను ప్రశ్నిస్తే మీ పార్టీ ముఖ్యమంత్రులు సైతం నోరు మెదపలేదు. కానీ నాడు నీకు మానవత్వంతో, నిజాయతీగా మద్దతుగా నిలబడింది కేసీఆర్. ఆరోజు నీకు అండగా నిలబడినందుకు ఇవాళ కేసీఆర్ ఇంటి మీదకే గూండాలను పంపుతావా? నీకు నిజంగా రాజ్యాంగం మీద నమ్మకం ఉంటే, నువ్వు మాట్లాడే మాటల్లో కొద్దిపాటి నిజాయతీ ఉన్నా తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకో అని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్.. కేసీఆర్ చావాలి, కేసీఆర్ చావును మేం కోరుకుంటున్నాం అని పబ్లిక్‌గా అన్నాడంటే అది శంకర్ మాట కాదు.. ముమ్మాటికీ రేవంత్ రెడ్డి మాటే.. రేవంత్ రెడ్డి ప్రతిరోజూ కేసీఆర్ చావును కోరుకుంటున్నాడు.. తన ఎమ్మెల్యేలతో కేసీఆర్‌ని తిట్టిస్తున్నాడు.. దాడులు చేయిస్తున్నాడు. రేవంత్ రెడ్డి.. అసలు నువ్వు కూర్చున్న ఆ ముఖ్యమంత్రి కుర్చీ కేసీఆర్ పెట్టిన భిక్ష. కేసీఆర్ ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడి తెలంగాణ సాధించకపోతే ఇవాళ నీకు ఈ ముఖ్యమంత్రి పదవి ఎక్కడిది అని వ్యాఖ్యానించారు. ఈరోజు పోలీసుల రక్షణలో కాంగ్రెస్ గూండాలు, ఎమ్మెల్యేలు కేసీఆర్ ఇంటిపై చేసిన ఈ దాడిని తెలంగాణ సమాజం, బీఆర్ ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అని హరీష్‌రావు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ ధరావతు వాపస్

**మొదటిపేజీ తరువాయి**

కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దరఖాస్తు సమయంలో ధరావతు(ఈఎండీ)గా రూ.10వేలను స్వీకరించారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులతోపాటు ఈఎండీ మొత్తాన్ని కూడా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే తీసుకున్నారు. ఈ ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తి అయినందున ఎంపిక కాని దరఖాస్తుదారులకు ఈఎండీని తిరిగి చెల్లిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. దరఖాస్తుదారులు తాము ఏ అకౌంట్ నుంచి ఈ మొత్తాన్ని చెల్లించారో అదే అకౌంట్‌కు జమ చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని, వారంలోగా ఈ చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. అయితే కొందరు దరఖాస్తుదారులు తాము మీ సేవా కేంద్రాల్లో నగదు ద్వారా చెల్లించామని, లేదా ఇతరుల అకౌంట్ నుంచి చెల్లించామని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇలా చెల్లించిన వారికి ఈ ధరావతు మొత్తం వారికే జమ అయ్యేలా చూడటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tస్త్రష్ట్రb.tవశ్రీaఅస్త్రaఅa.స్త్రశీజ. అఅ ద్వారా ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఏ అకౌంట్ ద్వారా చెల్లింపు జరిగిందో అదే అకౌంట్‌కు తిరిగి జమ అవుతుందని తెలిపారు.

**కొనసాగుతున్న వెరిఫికేషన్**

లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదని, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొన్ని రోజుల సమయం పడుతుందని గౌతం తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అర్హులైన వారికి ఇండ్ల కేటాయింపు పత్రాలను(అలాట్‌మెంట్ లెటర్) అందచేస్తామన్నారు. ప్రతిపాదించిన 7,340 ఇండ్లకు వెయిటింగ్ లిస్టుతో కలిపి సుమారు పదివేల మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. వెరిఫికేషన్ తరువాత లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని ఏ విధంగా, ఏ ఖాతాలో చెల్లించాలన్న దానిని అలాట్‌మెంట్ లెటర్‌లో పొందుపరుస్తామన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు లాటరీలో ఎంపికైన వారు సహకరించాలని వైస్ చైర్మన్ కోరారు. ఈ ఇండ్లకు సంబంధించిన సమాచారం కోసం ప్రత్యేకంగా హౌసింగ్ బోర్డు కార్యాలయాలచుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వాట్సాప్/ఎసఎంఎస్ వంటి వాటి ద్వారా అవసరమైన సమాచారం అందిస్తున్నామని, ఏమైనా సందేహాలుంటే కాల్ సెంటర్‌కు ఫోన్ 040I24603572) చేయవచ్చని సూచించారు.

**నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తులకు 10వ తేదీ ఆఖరు**

ఇందిరమ్మ టవర్స్ పథకంలో తొలుత 16 నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించి లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు ప్రక్రియను కూడా పూర్తి చేయగా మరో నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగు తున్నది. చాంద్రాయణగుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్మించనున్న టవర్స్‌లోని ఇండ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ దరఖాస్తులను ఈ నెల 10 వరకు సమర్పించవచ్చనీ, ఈ నియోజకవర్గాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌతం విజ్ఞప్తి చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

శాసనసభలో తమ పార్టీ మహిళా ప్రజాప్రతినిధికి జరిగిన అవమానానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర డ్రామాలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పరిపాలనా వైఫల్యాలు, ‘420’ హామీలు సహా అన్ని ప్రజా సమస్యలపై శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని, ప్రతీ అంశంపైనా స్పష్టమైన సమాధానాలు రాబడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు సభలో చర్చకు రాకుండా తప్పించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చిల్లర వేషాలు వేస్తోందని, ఈ పరిణామాలన్నింటినీ ప్రజలందరూ నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరింపులకు భయపడేవారు బీఆర్ఎస్‌లో ఎవరూ లేరని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరుగుతున్న దాడి, అరెస్టుల అంశంపై శాసనమండలిలో ఖచ్చితంగా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకురాళ్లపై జరిగిన దాడికి, బనాయించిన కేసులకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని తేల్చిచెప్పారు.

# ఎర్రవల్లిలో హైటెన్షన్

**సిద్దిపేట, సెప్టెంబర్ 8:**

సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి, దామరకుంట ప్రాంతాలు మంగళవారం తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు కేంద్రంగా మారాయి. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ నాయకులు చేపట్టిన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీ సింది. కాంగ్రెస్ శ్రేణులను బీఆర్ఎస్ కార్యక ర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్పై రాళ్ల దాడి కూడా జరిగింది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. శాసనసభ స్పీకర్ గడ్డం “ప్రసాద్కు మార్పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ లు తీవ్ర పదజా లంతో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతలు కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడికి పిలుపునిచ్చారు. ‘వెయ్యి డప్పులతో’ ఫామ్స్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావడంతో పోలీసులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు కూడా పెద్ద సంఖ్యలో ఎర్ర పల్లి వైపు కదిలే అవకాశం ఉండటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఒకే ప్రాంతంలో ఇరు పార్టీల కార్యక్రమాలు జరగనున్న నేపథ్యం లో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రవల్లి వైపు కదులుతున్న సమయంలో దామరకుంట వద్ద బీఆర్ఎస్ శ్రేణులు వారిని అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది.

**కాంగ్రెస్ కాన్వాయ్ పై రాళ్ల దాడి**

జరిగినట్లు సమాచారం. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇరువర్గాల మధ్యకు వచ్చి వారిని వెనక్కి పంపించే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది పోలీసులకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. కాంగ్రెస్ ముట్టడి పిలుపుతో ఎర్రవల్లి పరిస రాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఫామహౌస్కు వెళ్లే ప్రధాన రహదారుల్లో బారికే డ్లు, చెక్పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేపట్టారు. ఫామ్ హౌస్ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు చేసి, అదనపు పోలీసు బలగా లను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎర్రవల్లి వైపు వెళ్లే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేం దుకు పోలీసు బలగాలను మోహరించారు. అవస రమైతే ఆందోళనకారులను అదుపులోకి తీసుకు నేందుకు డిటెన్షన్ వాహనా లను కూడా సిద్ధంగా చేశారు. దామరకుంటలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలుసు కున్న వెంటనే బీఆర్ఎస్ అగ్రనేతలు ఎర్రవల్లి వైపు కదిలారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేసీఆర్ ఫామ్ హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. అసెంబ్లీ నుంచి నేరుగా ఎర్రవల్లి వైపు బయలుదేరిన వారి వాహనా లను పోలీసులు బొల్లారంహకీంపేట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం. వ్యక్తం చేశారు. తమ పార్టీ అధినేత నివాసానికి వెళ్లడాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసులను ప్రశ్నిస్తూ నేతలు వాగ్వాదానికి దిగారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు కేటీఆర్, హరీశ్రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. హరీశ్రావును జవహర్ నగర్ పోలీస్ స్టేషను, కేటీఆర్ ను బోయినపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలను కూడా వివిధ ప్రాంతాల్లో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ శ్రేణుల కదలికలను కూడా పోలీసులు నియంత్రించారు. ఉదయం నుంచే ఎర్రవల్లిఫామ్ హౌస్ పరిసరాలు పోలీసుల ఆధీనంలోకి వెళ్లినట్లు కనిపించింది. ప్రధాన రహదారుల వద్ద చెక్ పోస్టులు, బారికేడ్లు ఏర్పాటు చేసి అనుమానాస్పద కదలికలను నియంత్రించారు. ఫామ్ హౌస్ వైపు వెళ్లే మార్గాల్లో పోలీసు బలగాలను మోహరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్ హౌస్ సమీపానికి చేరకుండా పోలీసులు అడ్డుకోవడం, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు తమ అధినేత ఫామ్ హౌస్ వద్దకు చేరేందుకు ప్రయత్నించడం వల్ల భద్రతా చర్యలు మరింత కఠినతరం అయ్యాయి. కేసీఆర్ రాజకీయ ప్రస్థానంలో గజ్వేల్, ఎర్రవల్లి ప్రాంతా లకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. బీఆర్ఎస్ అధినేత రాజకీయంగా కీలక నిర్ణయాలు తీసుకునే సంద ర్భాల్లో ఎర్రవల్లి ఫామ్ హౌస్ ప్రాధాన్యం సంతరిం చుకున్న విషయం తెలిసిందే. అలాంటి ప్రాంతంలో నే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు భారీ నిరసనకు దిగడం, వారిని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడం, ఆ తర్వాత బీఆర్ఎస్ అగ్రనేతలు స్వయంగా అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. మంగళవారం జరిగిన పరిణామాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు ఇకపై కేవలం అసెంబ్లీ వేదికకే పరిమితం కాదనే సంకేతాలను ఇచ్చాయి. మొత్తంగా చూస్తే మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి, దామరకుంట ప్రాంతాలు రాజకీయాల్లో హాట్ స్పాట్‌గా మారాయి. కేసీఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్ శ్రేణుల ప్రతిఘటన, రాళ్ల దాడి తోపులాట, కేటీఆర్‌హరీశ్రావుల ఎర్రవల్లి ప్రయాణం, పోలీసుల అడ్డగింత అరెస్టులు, 144 సెక్షన్ అమలు, భారీ బందోబస్తు.. ఇలా వరుస పరిణామాలతో సిద్దిపేట జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా మార్పు రావడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

# తిట్టింది నా తల్లిని.. నీకెందుకు ఆగ్రహం?

**మొదటిపేజీ తరువాయి**

క్షమాపణకు పట్టుబట్టగా.. బీఆర్ఎస్ తరపున హరీశ్‌రావు స్పందించారు. ఈ క్రమంలో స్పీకర్, హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మహిళా ఎమ్మెల్యేల వ్యవహారంపై అభ్యంతరం**

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు అవమానించారని హరీశ్‌రావు సభలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెబుతారని తాము భావించామని అన్నారు. ఇదే సందర్భంలో తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ స్పీకర్ అలా భావిస్తే మధు ఇప్పటికే క్షమాపణ చెప్పారని వివరించారు.

**హరీశ్ వ్యాఖ్యలపై స్పీకర్ ఆగ్రహం**

హరీశ్‌రావు మాట్లాడిన తీరుపై స్పీకర్ తీవ్రంగా స్పందించారు. ఎంతో సీనియర్ సభ్యుడైన హరీశ్‌రావు మాట్లాడిన తీరు సరిగా లేదన్నారు. తన తల్లిని తిట్టారని, హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. తనకు ఆగ్రహం ఉంటుందని స్పష్టం చేస్తూ.. ‘‘నీ తల్లిని తిట్టనప్పుడు నీకెందుకు ఆగ్రహం?’’ అంటూ హరీశ్‌రావును నిలదీశారు.

**సోదరీమణులతో సమానమని వెల్లడి**

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని తాను సోదరీమణులతో సమానంగా భావిస్తానని స్పీకర్ తెలిపారు. వారిపై దాడి జరిగిందని తెలియగానే నివేదిక కోరినట్లు చెప్పారు. నివేదిక అందిన తర్వాత తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**‘నన్ను బెదిరించలేవు’**

ముందుగా తన తల్లిని తిట్టిన అంశంపై హరీశ్‌రావు మాట్లాడాలని స్పీకర్ వాయిస్ పెంచుతూ అన్నారు. ఒక దశలో హరీశ్‌రావును ఉద్దేశించి తనను బెదిరించలేవని హెచ్చరించారు. దీంతో అసెంబ్లీలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# స్పీకర్‌కు సీఎం రేవంత్ పరామర్శ

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

బీఆరఎస్ నాయకులు ఏకంగా స్పీకర్‌ని అసభ్యకర పదజాలంతో దూషించి మొత్తం తెలంగాణ సమాజాన్ని అవమానపరిచేలా వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎదుట జరిగిన ఈ దురదృష్టకర పరిణామాలపై పత్రికలు, టీవీలు, అన్ని మీడియాలు ప్రముఖంగా ప్రచురించాయన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించటంతో స్పీకర్ కంట తడి పెట్టుకున్న దృశ్యాలు చూసి ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను సీఎం పరామర్శించారు. స్పీకర్‌ను ఓదార్చారు. నిన్న జరిగిన సంఘటనలపై విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధ్యులపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్‌కు తెలియజేశారు.

# రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప చావు కోరుకోవడమేంటి?

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఎందుకు చర్యలు తీసుకోరు?
- ప్రతిపక్ష నాయకుడి ఇంటిమీదికి దండయాత్రా
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలి
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 8:**

కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోటి దురుసుతో ప్రత్యర్థి నాయకులను, కులాలను, వ్యవస్థలను దూషించడం, దుర్భాషలాడటం ఇదే మొదటిసారి కాదు.. అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం విచిత్రంగా వుందన్నారు. అంటే ఆయన దూషణలను కాంగ్రెస్ సమర్థిస్తుందా? ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటీ? ఒక ముఖ్యమంత్రే తన పార్టీ నాయకులను ఇలాంటి దాడికి ఉసిగొల్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం పని చేస్తోందని ఆ ప్రకటనలో ప్రశ్నించారు. ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు అందక విద్యార్థులు, 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు నమోదు అయి రైతులు, ప్రజలు, ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు, యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. వరుసగా జరుగుతోన్న అఘాయిత్యాలు, హత్యాచారాలతో భయం భయంగా మహిళలు కాలం గడుపుతున్నారు. నాణ్యమైన భోజనం, వసతులు లేక గురుకులాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు సహా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండు రోజులుగా విలువైన సభా సమయాన్ని వృథా చేశాయి, రేపటి నుంచి అయినా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి.. వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని కవిత కోరారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్

- అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- అరెస్టులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 9:**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో, నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభ రోజే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశాల మేరకే వారిని అడ్డుకుంటున్నామని పోలీసులు చెప్పడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**తాతా మధుపై కేసు**

ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. స్పీకర్‌ను కులం పేరుతో దూషించడంతోపాటు అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మరో ఎమ్మెల్సీ అరెస్ట్**

తాతా మధును న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరినీ నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కఠిన చర్యలకు డిమాండ్**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మరుసటి రోజే ఇద్దరు ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తమ ఎమ్మెల్సీల అరెస్టుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

- పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం

**ముంబై, సెప్టెంబర్ 8 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## తొలి బుల్లెట్ రైలు.. త్వరలోనే పట్టాలపైకి!

- సూరత్-బిలిమోరా సెక్షన్‌ను వచ్చే ఏడాది ప్రారంభించడమే లక్ష్యం
- డిసెంబరు 2026 నాటికి వాపీ-సూరత్ సివిల్ పనులు పూర్తి
- గంటకు 320 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లనున్న రైలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:**

భారతీయుల కలల ప్రాజెక్టుగా భావిస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలోనే పట్టాలెక్కనుంది. దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు ఊహించిన దానికంటే వేగంగా సాగుతున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వచ్చే ఏడాదిలోగా సూరత్‌బిలిమోరా మధ్య తొలి సెక్షన్‌ను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వాపీసూరత్ సెక్షన్ సివిల్ నిర్మాణ పనులను డిసెంబరు 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

**508 కిలోమీటర్ల కారిడార్**

ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ సుమారు 508 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. 2017 సెప్టెంబరులో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మహారాష్ట్ర, గుజరాత్, దాద్రానగర్ హవేలీ ప్రాంతాల మీదుగా సాగుతుంది. ప్రయాణికుల సౌకర్యం కోసం ముంబై, ఠాణే, విరార్, బోయిసర్, వాపీ, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి ప్రాంతాల్లో మొత్తం 12 స్టేషన్లను నిర్మిస్తున్నారు. స్థానిక సంస్కృతి, నగరాల ప్రత్యేకత ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణ శైలితో స్టేషన్లను తీర్చిదిద్దుతున్నారు.

**320 కిలోమీటర్ల వేగం**

బుల్లెట్ రైలు పట్టాల నిర్మాణంతోపాటు రైళ్ల తయారీ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. పరీక్షల కోసం ప్రత్యేకంగా రూపొందించిన తొలి కోచ్ ఇప్పటికే సిద్ధమైంది. గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే ఈ రైలుతో అహ్మదాబాద్‌ముంబై మధ్య ప్రయాణ సమయం 2 గంటల 58 నిమిషాలకు తగ్గనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అత్యున్నత భద్రతా ప్రమాణాలను అందించేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.

**ఆగస్టు 2027లో తొలి సర్వీస్**

తాజా అంచనాల ప్రకారం తొలి పూర్తిస్థాయి బుల్లెట్ రైలు సర్వీసును ఆగస్టు 2027లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మొదటి దశలో సూరత్‌బిలిమోరా సెక్షన్‌ను వచ్చే ఏడాది ప్రారంభించనున్నారు. వాపీసూరత్ మధ్య సివిల్ నిర్మాణ పనులను డిసెంబరు 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్‌ను డిసెంబరు 2029 నాటికి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు ఆక్షేపణీయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 :**

అసెంబ్లీ అవరణలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అయిన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలతో పోలీసులు వ్యవహరించిన తీరు చాలా హేయమైనదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఒక ప్రకటనలో అన్నారు. మహిళా శాసన సభ్యులపై పోలీసులు అనుచితంగా ఎవరి ఆదేశాల ప్రకారం ప్రవర్తించారు.. సీఎంగానా, హోం మంత్రిగానా ఏ హోదాలో పోలీసులను ఆదేశించారు అంటూ ప్రశ్నించారు. పాలకులకు కొంచెమైనా సిగ్గు అనిపించడంలేదా అని అడిగారు. >స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణలు కోరాలని, చర్యలు తీసుకోవాలని సభలో చర్చించారని, దాంతోపాటు మహిళా శాసన సభ్యులపై వ్యవహరించిన తీరుపై చర్చ పెట్టాలి అని డిమాండ్ చేశారు. మహిళా శాసనసభ్యులను ఎందుకు అవమానించాల్సి వచ్చింది, మహిళా ఎమ్మెల్యేల మెడ, వెంట్రుకలు పట్టుకుని గుంజడం, చీర లాగడంపై నోరు విప్పకపోవడం కన్నా దారుణం ఏమైనా ఉంటుందా అని నిలదీశారు. ఆ పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఎమ్మెల్యేల పరిస్థితి ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవాలన్నారు. పార్టీలు వేరైనా సాటి ఎమ్మెల్యేలను గౌరవించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంటుందన్నారు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి ఇంకో న్యాయం సరైంది కాదన్నారు. మహిళ పట్ల మరింత గౌరవం ఉండాలిలని సూచించారు. ఇది పార్టీలకు సంబంధం లేని అంశమని, ఒక మహిళగా, పార్లమెంటు సభ్యురాలిగా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాని అరుణ అన్నారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు కొత్త దశ

- యూపీఐని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్న ప్రధాని నరేంద్ర మోడీ
- ఫిన్‌టెక్‌ను తదుపరి దశకు తీసుకెళ్లాలని సూచన
- రుణాలు, బీమా, పొదుపు రంగాల్లో టెక్నాలజీ వినియోగం పెంచాలని పిలుపు
- ఏజెంటిక్ ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలపై దృష్టి పెట్టాలని సూచన
- సైబర్ భద్రత, బలమైన నియంత్రణ వ్యవస్థ అవసరమన్న ప్రధాని

**ముంబై, సెప్టెంబరు 8:**




భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ తదుపరి దశకు సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2026లో మంగళవారం ప్రసంగించిన ఆయన.. గత దశాబ్ద కాలంలో దేశ ఫిన్‌టెక్ ప్రయాణం ఎంతో ప్రత్యేకంగా సాగిందని పేర్కొన్నారు. డిజిటల్ పరివర్తనలో యూపీఐ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. దేశం ఇప్పటికే అవసరమైన స్థాయి, విస్తృతి, ప్రజలందరికీ అందుబాటు సాధించిందని.. ఇప్పుడు ఫిన్‌టెక్ వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం వచ్చిందన్నారు.

**యూపీఐ విస్తరణపై మోడీ దృష్టి**

యూపీఐ భారత అభివృద్ధి కథనంతో విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గత పదేళ్లలో ఫిన్‌టెక్ రంగం విస్తరించడంతో అధికారిక ఆర్థిక వ్యవస్థకు దూరంగా ఉన్న కోట్లాది మంది ప్రజలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారని చెప్పారు. యూపీఐతో ప్రజలు ఆర్థిక సేవలను వినియోగించే విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. భారత్ యూపీఐ ప్రస్తుతం 11 దేశాల్లో అందుబాటులో ఉందని.. ఇక ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో అనుసంధానం చేయడమే తదుపరి లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

**ఫిన్‌టెక్ విస్తరణకు మోడీ పిలుపు**

ఫిన్‌టెక్ రంగం కేవలం డిజిటల్ చెల్లింపులకే పరిమితం కాకూడదని ప్రధాని నరేంద్ర మోడీ సూచించారు. రుణాలు, పొదుపులు, పెన్షన్లు, బీమా వంటి రంగాల్లో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని అన్నారు. వీధి వ్యాపారులను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పీఎం స్వనిధి క్రెడిట్ కార్డు పథకాన్ని 2030 వరకు కొనసాగించాలని నిర్ణయించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. సాంకేతికత ద్వారా వినియోగదారుల ఆర్థిక అవసరాలను అర్థం చేసుకుని, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన ఆర్థిక ఉత్పత్తులను రూపొందించవచ్చన్నారు.

**కొత్త సాంకేతికతలపై మోడీ సూచన**

క్వాంటమ్ కంప్యూటింగ్, ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలు ఆర్థిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జీఎఫ్ఎఫ్ 2026లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీలపై ప్రధానంగా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో ఈ సాంకేతికతలు కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్నారు.


**సైబర్ భద్రతకు మోడీ ప్రాధాన్యం**

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఫిన్‌టెక్ రంగానికి బలమైన నియంత్రణ వ్యవస్థ కూడా అవసరమన్నారు. తదుపరి దశలో ఆవిష్కరణలకు సాంకేతిక సామర్థ్యాలతో పాటు ప్రజల విశ్వాసం, భద్రత, సమర్థవంతమైన నియంత్రణ కీలకమని పేర్కొన్నారు.

## అపర్ణ కురుప్‌పై పోలీసు కేసు

- మతపరమైన భావాలు దెబ్బతీశారంటూ కేసు నమోదు
- టీవీ డిబేట్‌లో వ్యాఖ్యలే కారణం
- సోషల్ మీడియాలో బెదిరింపులపై మరో కేసు
- ఛానెల్ నుంచి కార్యక్రమం తొలగింపు
- మతపెద్ద వ్యాఖ్యలపై కొనసాగుతున్న వివాదం

**కొచ్చి, సెప్టెంబరు 8:**



కేరళకు చెందిన ముస్లిం మతపెద్ద మహిళలను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నిర్వహించిన టీవీ చర్చ ఇప్పుడు పోలీసు కేసుకు దారితీసింది. ఈ చర్చలో పాల్గొన్న మలయాళ టీవీ జర్నలిస్ట్, యాంకర్ అపర్ణ కురుప్‌పై కొచ్చి సిటీ సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాసర్‌గోడ్‌కు చెందిన అబ్దుల్ హకీమ్ బీఎం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సెప్టెంబరు 7న కేసు నమోదైంది.

**మతపరమైన భావాలు దెబ్బతీశారంటూ..**

టీవీ డిబేట్ సందర్భంగా అపర్ణ కురుప్ చేసిన వ్యాఖ్యలు మతపరమైన భావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అల్లర్లను ప్రేరేపించడం, మతపరమైన భావాలను దెబ్బతీయడం, వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం వంటి ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివాదం నేపథ్యంలో సదరు టీవీ ఛానెల్ ఆ కార్యక్రమాన్ని తొలగించింది. అపర్ణ కురుప్‌తో పాటు ఛానెల్ యాజమాన్యం తమ వ్యాఖ్యలపై ఇప్పటికే విచారం వ్యక్తం చేశాయి.

**బెదిరింపులపైనా కేసు**

ఇదిలా ఉండగా, అపర్ణ కురుప్‌పై సోషల్ మీడియాలో పరువు నష్టం కలిగించే పోస్టులు, బెదిరింపులు వస్తున్నాయంటూ ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై విజ్డమ్ స్టూడెంట్స్ సంస్థకు చెందిన అబ్దుల్లా బాసిల్ సి.పి.తో పాటు మరో గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదైంది.

**మతపెద్ద వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

ఇటీవల సున్నీ మత పండితుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలు కేరళలో వివాదానికి దారితీశాయి. మతపరమైన వేడుకల సమయంలో ముస్లిం మహిళలు తమకు సంబంధం లేని పురుషులతో కలిసి బహిరంగ ప్రదేశాల్లో ఉండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కేరళలో రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. కేరళ సీఎం వీడీ సతీషన్ స్పందిస్తూ.. మతపండితుడి వ్యాఖ్యలు 21వ శతాబ్దపు ప్రగతిశీల ఆలోచనలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

## కొత్త ప్రపంచ పటంలో అరుణాచల్ ప్రదేశ్.. అక్సాయ్ చిన్!

- భారత్ సరిహద్దుల వెలుపల ఉన్నట్లు ఐరాస మ్యాప్‌లో చిత్రీకరణ
- అరుణాచల్-నాగాలాండ్ సరిహద్దు తొలగింపుపై వివాదం
- అక్సాయ్ చిన్‌ను ప్రత్యేక ప్రాంతంగా చూపించిన ఐరాస
- 'కరెక్ట్ ద మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు.. మ్యాప్‌ను మాత్రం అంగీకరించలేదు
- సార్వభౌమత్వంపై రాజీపడేది లేదన్న భారత్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:**

ఐక్యరాజ్యసమితి రూపొందించిన కొత్త ప్రపంచ పటంలో అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్ సరిహద్దుల వెలుపల ఉన్నట్లు చూపించడం వివాదానికి దారితీసింది. భారత్‌చైనా మధ్య సరిహద్దు వివాదంలో ఉన్న ఈ రెండు ప్రాంతాలను వేర్వేరు ప్రాంతాలుగా చిత్రీకరించడం అభ్యంతరాలకు కారణమైంది. ఇటీవల ఐరాస జనరల్ అసెంబ్లీ ఆమోదించిన 'కరెక్ట్ ద మ్యాప్' తీర్మానం తర్వాత ఈ కొత్త మ్యాప్ వెలువడింది.

**అరుణాచల్ సరిహద్దులపై మార్పులు**

కొత్త మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించినట్లు కనిపిస్తోంది. అరుణాచల్‌ను అస్సాం, చైనాలతో సరిహద్దులు కలిగిన ప్రత్యేక ప్రాంతంగా చూపించారు. అక్సాయ్ చిన్‌ను పశ్చిమ వైపు భారతదేశంతో, తూర్పు వైపు చైనాతో సరిహద్దు కలిగిన ప్రత్యేక ప్రాంతంగా చిత్రీకరించారు. ఈ మార్పులకు గల కారణాలను ఐరాస ఇప్పటివరకు వివరించలేదు.

**జమ్మూ కాశ్మీర్‌పై వేరుగా**

జమ్మూ కాశ్మీర్ విషయంలో మాత్రం నియంత్రణ రేఖను (ఎల్‌ఓసీ) చుక్కల రేఖతో ఐరాస మ్యాప్‌లో చూపించింది. భారత్, పాకిస్థాన్ మధ్య జమ్మూ కాశ్మీర్ తుది స్థితిపై ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదనే అంశాన్ని ఐరాస పేర్కొంది.

**తీర్మానానికి భారత్ మద్దతు**

వాస్తవ విస్తీర్ణాలను ప్రతిబింబించేలా కొత్త ప్రపంచ పటానికి సంబంధించిన తీర్మానాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 4న ఆమోదించింది. దీనికి 164 దేశాలు అనుకూలంగా ఓటేయగా.. అమెరికా వ్యతిరేకంగా ఓటు వేసింది. భారత్ కూడా తీర్మానానికి మద్దతు తెలిపింది. అయితే నిర్దిష్ట మ్యాప్, మ్యాప్ ప్రొజెక్షన్ లేదా జాతీయ సరిహద్దుల చిత్రీకరణను ఆమోదించడం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సమాన విస్తీర్ణ ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించే సూత్రానికే భారత్ మద్దతు తెలిపిందని పేర్కొంది.

**సరిహద్దులపై రాజీ లేదన్న భారత్**

జమ్మూ కాశ్మీర్, లడాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాలను అధికారిక భారత మ్యాప్ ప్రకారమే చూపించాలని భారత్ స్పష్టం చేసింది. తప్పుదారి పట్టించేలా ఉన్న ఏ మ్యాప్‌నూ అంగీకరించబోమని పేర్కొంది. దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో తమ వైఖరి స్పష్టంగా ఉందని, ఇందులో ఎలాంటి రాజీ ఉండదని తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడాఖ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్ తన భూభాగాలుగా పేర్కొంటోంది.

## అనర్హులను ఉపాధ్యాయులుగా నియమించవద్దు

- టీచర్ల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- ఉద్యోగంలో కొనసాగించడంపైనా మధ్యంతర ఆంక్షలు
- ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనలు తప్పనిసరని స్పష్టం
- టీచర్లు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రొవిన్షియలైజేషన్‌పై పిల్
- ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన ఎస్‌సీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:**



ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగంలో కొనసాగింపుపై సుప్రీంకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించకూడదని, అలాంటి వారిని ఉద్యోగాల్లో కొనసాగించకూడదని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రొవిన్షియలైజేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.

**అర్హతలు తప్పనిసరన్న సుప్రీంకోర్టు**

సంబంధిత చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు ఉపాధ్యాయులకు తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల కింద నిర్దేశించిన అర్హతలు లేని వ్యక్తులను పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించకూడదని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న ఉపాధ్యాయుల విషయంలోనూ సంబంధిత చట్టాలు, నిబంధనల్లోని అర్హతలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

**టీచర్ల నియామకాలపై పిల్**

విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులను ప్రొవిన్షియలైజేషన్ చేసే ప్రక్రియకు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ ఈ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై తమ స్పందనను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణలో కేసుకు సంబంధించిన ఇతర అంశాలను పరిశీలించనుంది.

**ఏ చట్టం ఏం చెబుతుంది?**

ఆర్‌టీఈ చట్టం ప్రాథమిక విద్యకు సంబంధించిన ప్రమాణాలు, నిబంధనలను నిర్దేశిస్తుంది. ఎన్‌సీటీఈ పాఠశాల ఉపాధ్యాయులకు అవసరమైన అర్హతలు, ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన నిబంధనలను పర్యవేక్షిస్తుంది. యూజీసీ ఉన్నత విద్యా సంస్థల్లో బోధించే అధ్యాపకులకు వర్తించే అర్హతలు, ప్రమాణాలను నిర్దేశిస్తుంది. దీంతో పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకం, ఉద్యోగంలో కొనసాగింపు సమయంలో సంబంధిత చట్టాల ప్రకారం నిర్దేశించిన అర్హతలను పాటించడం తప్పనిసరి కానుంది.

**తుది తీర్పు వరకు మధ్యంతర ఆదేశాలు**

ప్రస్తుతం సుప్రీంకోర్టు జారీ చేసినవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే. పిల్‌పై తుది తీర్పు వెలువడే వరకు ఇవి అమల్లో ఉంటాయి. తదుపరి విచారణల్లో ఈ ఆదేశాల పరిధి, ప్రభావం, ఏయే ఉపాధ్యాయులు, విద్యా సంస్థలకు ఇవి వర్తిస్తాయనే అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గణేష్ ఉత్సవాలు శాంతియుత నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్
- నేటి నుండి నిమజ్జనం వరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



**శెనార్తి మీడియా, నారాయణపేట:** వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉత్సవాలు సజావుగా జరిగేందుకు భద్రత పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలు 14.09.2026 నుండి 25.09.2026 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల భద్రత, రక్షణ ముందు నుంచే పోలీస్ అధికారులు పటిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ముందుగా మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహించాలి. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటు వివరాలను తప్పనిసరిగా పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రధాన రహదారులు, రోడ్లపై మండపాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదు.నిబంధనలకు విరుద్ధంగా డీజేలకు అనుమతి ఇవ్వకూడదు. రౌడీషీటర్లు, కమ్యూనల్ షీటర్ల ను మండలాల వారిగా బండోవర్ చేయాలని మరియు ఇతర సమస్యాత్మక వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టేలా అవగాహన కల్పించాలి. గణేష్ విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయాలి. నిమజ్జనం జరిగే రూట్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ ప్రతి రోజు గ్రామాలలో పర్యటించి ఆర్గనైజర్స్ తో మాట్లాడుతూ వారితో వాట్స్ అప్ గ్రూప్ ఏర్పాటు చేసి వారికి సూచనలు చేయాలి. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరిరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదగా ఉండాలని ఎవరి పైన అనుచితంగా ప్రవర్తించరాదు అని తెలిపారు. జిల్లా పరిధిలో సోషల్ మీడియా పై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలి అని సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకొని శాంతి భద్రతలు పరిరక్షించాలి అలాగే ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్లర్లు సృష్టించాలని చూస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, నల్లపు లింగయ్య,సీఐ శివ శంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, RI విజయ్ భాస్కర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, పురుషోత్తం, భాగ్యలక్ష్మి రెడ్డి, విజయ్ భాస్కర్, రాజు, అశోక్ బాబు, చంద్ర శేఖర్, ఎస్.ఎం నవీద్, గాయత్రి, మహేశ్వరి, కృష్ణ చైతన్య, శ్వేత, శిరీష, బాలరాజు తది తరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శ్రావణమాస మంగళవారం సందర్భంగా శంకరపట్నం మండలం కన్నాపూర్ ధర్మారం గ్రామంలోనీ శ్రీ వాలి సుగ్రీవాంజనేయ రామాలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు కలకుంట్ల మురళీ కృష్ణమాచార్యుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సమర్పణ, జిల్లేడు, తమలపాకుల మాలసేవ నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలమాలలతో ఆంజనేయస్వామిని అంగరంగ వైభవంగా అలంకరించారు. భక్తులు 21 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



# విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకున్న అమరవీరుల పోరాటాలు

- మంచిర్యాలలో సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి సభ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 26 ఏళ్ల క్రితం వామపక్షాల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాల ఫలితంగానే విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ప్రమాదం నుంచి రక్షించబడిందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. మంచిర్యాలలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాడు ప్రపంచ బ్యాంకు విధానాలను అనుసరించిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ చార్జీలను ఏకపక్షంగా పెంచడంతో పాటు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించిందని నాయకులు ఆరోపించారు. ప్రజలపై భారాలను వ్యతిరేకిస్తూ వామపక్షాలు చేపట్టిన విద్యుత్ ఉద్యమంలో ముగ్గురు యువ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఉద్యమాన్ని పోలీసుల దమనకాండతో అణచివేయాలని నాటి ప్రభుత్వం ప్రయత్నించిందని, అందులో భాగంగానే 2000 ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో పోలీసు కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో విష్ణువర్దన్‌రెడ్డి, బాలస్వామి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సత్తెనపల్లి రామకృష్ణ సెప్టెంబర్ 8న ఆసుపత్రిలో మృతి చెందారని తెలిపారు. బషీర్‌బాగ్ పోరాట అమరవీరుల త్యాగాలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నేటికీ స్మరించుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం పాలకులు సైతం ప్రైవేటీకరణ విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. రామకృష్ణతో పాటు బషీర్‌బాగ్ అమరవీరులు అందించిన పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాష్, బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి నాయకులు మోతే రామదాసు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూర్కె మోహన్ తదితరులు పాల్గొన్నారు

# సీఐడీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ చిర్ర శ్రీనివాస్ సోమవారం జరిగిన సీఐడీ పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన సీఐడీ కుటుంబ సభ్యులకు శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సీఐడీ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.

# దోమ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ స్నేహ మెహ్రా






**శెనార్తి మీడియా, దోమ** :వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, మంగళవారం దోమ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి శాంతిభద్రతలు, పోలీస్ సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి మరియు పెండింగ్ కేసులను సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండెన్సీ, మాడ్యూళ్ల వినియోగం, రికార్డుల నవీకరణను సమీక్షించి, నిర్దేశిత గడువులోగా కంప్లయన్స్ పూర్తి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు, కేసుల దర్యాప్తు, నివారణ మరియు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.సైబర్ నేరాల నమోదు, దర్యాప్తు, పరిష్కారం, సైబర్ మోసాలపై తక్షణ స్పందన, సైబర్ హెల్ప్ డెస్క్‌ల పనితీరును సమీక్షించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు మరియు నివారణ చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రత, మహిళా హెల్ప్ డెస్క్‌ల పనితీరు, బాధితుల సహాయ సేవలను సమీక్షించారు. టీజీ కాప్స్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. సీసీ టీవీ నిఘా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, అవసరమైన సందర్భాల్లో ఫుటేజ్‌ను దర్యాప్తులో ఉపయోగించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, నేర నియంత్రణకు రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని,ఉన్నతాధికారుల ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, దోమ ఎస్ఐ వసంత్ జాదవ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



**శెనార్తి మీడియా, కరీంనగర్ :** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి (రెవెన్యూ) వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతను పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, ఏఐఎంఐఎం, బీఎస్పీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికల వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**శెనార్తి మీడియా, పరిగి:**




పరిగి జోన్ స్థాయి ఎస్‌జీఎఫ్ (SGF) అండర్–14, అండర్–17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ 2026–27 కార్యక్రమాన్ని మంగళవారం సాల్వేడ్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, ఫిట్‌నెస్‌తో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. గెలుపు, ఓటములు జీవితంలో విలువైన పాఠాలు నేర్పుతాయని, ఓటమి గెలుపుకు తొలి అడుగు అని అన్నారు. ఓటములతో నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఓ లక్ష్యం ఉండాలని, దానిని సాధించేందుకు స్పష్టమైన గమ్యాలను ఏర్పరచుకుని కష్టపడి పని చేయాలని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చాటి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని టోర్నమెంట్‌లో పాల్గొంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాసులు, పరిగి సీఐ కె. కొండల్‌రెడ్డి, ఎంఈఓ జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఏఎంఎస్ చైర్మన్ బి.ఎస్. అంజనేయులు, సాల్వేడ్ సర్పంచ్ లక్ష్మమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి: కలెక్టర్ స్నేహ శబరీష్



**శెనార్తి మీడియా, మహబూబాబాద్ :** జిల్లాలో సమగ్ర భూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో జరుగుతున్న భూ సర్వేను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు చేపట్టాలని, సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జీపీ ఓ నర్మద, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# కూచిపూడికి శాశ్వత ప్రాణదాత వేదాంతం శర్మ

## నేడు వేదాంతం సత్యనారాయణ శర్మ జయంతి

కూచిపూడి నాట్యకళకు ప్రపంచ వేదికలపై విశిష్టమైన గుర్తింపును తెచ్చిన కళా మహనీయుడు వేదాంతం సత్యనారాయణ శర్మ. స్త్రీ పాత్రలను పోషించడంలో ఆయన కనబరచిన నైపుణ్యం, అభినయ శక్తి, హావభావాల లోని సున్నితత్వం కూచిపూడి నాట్య చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం. స్త్రీ వేషధారణలో ఆయన చూపిన అద్భుత కౌశల్యం వల్లే కళా రసికులు ఆయనను "స్త్రీ పాత్రల నటనా సార్వభౌముడు"గా సత్కరించారు. 1935 సెప్టెంబర్ 9న కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో జన్మించిన ఆయనకు కళారంగం వారసత్వంగా లభించింది. తండ్రి వేదాంతం వెంకట రామయ్య స్వయంగా కూచిపూడి కళాకారుడు. బాల్యం నుంచే నాట్యాసక్తి కలిగిన ఆయన, వేదాంతం రాఘవయ్య, వేదాంతం వెంకట చలపతి, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వంటి గురువుల వద్ద శిక్షణ పొందారు. ఈ శిక్షణ లోనే ఆయనకు స్త్రీ పాత్రల నటనలోని మెళకువలు అవగాహన అయ్యాయి.

శర్మగారు సత్యభామ పాత్రలో చేసిన "భామాకలాపం" ప్రదర్శన అమర కీర్తిని తెచ్చింది. సత్యభామ అహంకారం, అలక, భక్తి, ప్రణయభావాలు ఆయన అభినయంతో జీవం పొందాయి. "ఉషా పరిణయం"లో చిత్రలేఖగా, "క్షీరసాగర మథనం"లో మోహినిగా ఆయన కనబరచిన నటనా వైభవం ప్రేక్షకులను విభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఆయన మోహిని పాత్ర ధారణలోని ఆకర్షణీయమైన లావణ్యం, సౌందర్య భావన, మృదువైన హావభావాలు ప్రేక్షకుల హృదయాలలో అచంచల ముద్ర వేశాయి. కేవలం నటనలోనే కాదు, దర్శకత్వంలోనూ ఆయన తన ప్రతిభను చాటారు. పునరావృతమవుతున్న నాట్య, నాటికలకు కొత్తదనాన్ని జోడించి, సంప్రదాయంలో ఆధునికతను కలిపారు. ఆయన చేసిన ప్రదర్శనలు దేశమంతటా మాత్రమే కాక, అమెరికా, యూరప్, రష్యా, జపాన్ వంటి అనేక దేశాలలోనూ కూచిపూడికి విశేష గౌరవాన్ని తెచ్చాయి. గురువుగా ఆయన పాత్ర మరింత విశిష్టం. ఆంధ్ర విశ్వవిద్యాలయం, పి.ఎస్. తెలుగు విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థల్లో ఆయన బోధన చేసి, అనేకమంది శిష్యులను తీర్చిదిద్దారు. ఆయన శిష్యులు కూచిపూడి నాట్యానికి ప్రతిష్ఠ తీసుకొచ్చారు. గురుకుల పద్ధతిని పునరుద్ధరించి, శిష్యులకు శాస్త్ర బద్ధంగా, సంప్రదాయ పూర్వకంగా శిక్షణ అందించారు. కేవలం నృత్యకళ నేర్పడమే కాదు, కూచిపూడి తత్త్వం, దాని ఆధ్యాత్మిక పరమార్థాన్ని కూడా ఆయన శిష్యులలో నాటారు. శర్మ కళాకారుడిగానే కాక, పరిశోధకుడిగానూ కూచిపూడికి అపూర్వమైన సేవ అందించారు. "భామాకలాపం – ఒక సమగ్ర అధ్యయనం", "కూచిపూడి నృత్య చరిత్ర", "నాట్యశాస్త్రం – కూచిపూడి దృక్కోణం", "కూచిపూడి యక్ష గానాలు" వంటి గ్రంథాలను రచించి, నాట్య శాస్త్రానికి, కూచిపూడి సంప్రదాయానికి శాస్త్రీయ స్థిరత్వాన్ని కల్పించారు. ఆయన రచనల ద్వారా కూచిపూడి కళారూపం విశ్వ విద్యాలయ స్థాయిలో అధ్యయనార్థకమైన శాస్త్రీయమైన ఆధారాన్ని పొందింది. ఈ కారణంగానే కూచిపూడి కళ పాఠశాలలకే పరిమితం కాక, విశ్వ వ్యాప్తంగా పరిశోధనలకు, పాఠ్యాంశాలకు స్థానం సంపాదించింది. ఆయన కృషికి గుర్తింపుగా అనేక గౌరవాలు వరించాయి. 1961లో సంగీత నాటక అకాడమీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే కళాప్రపూర్ణ బిరుదు, 1998లో పద్మభూషణ్, 2011లో పద్మశ్రీ వంటి విశిష్ట పురస్కారాలు ఆయన కళా మహిమాన్వితతకు నిదర్శనం. అదేవిధంగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1988లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కాళిదాస్ సమ్మాన్ అవార్డుతో సత్కరించింది. 2005లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం "హంస అవార్డు"ను అందచేసింది. సిద్ధేంద్రయోగి నర్తన అవార్డును అందుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం "భరతముని అవార్డు"తో సత్కరించింది. ఈ గౌరవాలు ఆయన ప్రతిభకు కేవలం బిరుదులు మాత్రమే కాక, కళామహిమాన్వితతకు ఇచ్చిన సాక్ష్యాలు. కూచిపూడి నాట్య ప్రదర్శనల ద్వారా వేదాంతం సత్యనారాయణ శర్మ మన తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుండి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్రపతులు వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, డా. శంకర్ దయాళ్ శర్మ, డా. జకీర్ హుస్సేన్, డా. ఆర్.కె. నారాయణన్‌ల వంటి మహానుభావుల చేత ప్రశంసలు పొందారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులుగా ఇంద్రాగాంధీ, పి.వి. నరసింహారావు వంటి నేతలు ఆయన ప్రదర్శనలను ప్రత్యక్షంగా తిలకించి ప్రశంసించారు. ఈ గుర్తింపులు కేవలం కళాకారుడికి మాత్రమే కాక, కూచిపూడి సంప్రదాయానికే మరింత గౌరవం తీసుకొచ్చాయి.

2012 నవంబరు 15న ఆయన పరమపదించినా, ఆయన వారసత్వం నేటికీ కూచిపూడి ప్రతి ప్రదర్శనలో జీవిస్తూనే ఉంది. ఆయన బోధనలు, రచనలు, ప్రదర్శనలు, శిష్యులు కలసి కూచిపూడిని శాశ్వత సజీవ కళారూపంగా నిలబెట్టాయి. వేదాంతం సత్యనారాయణ శర్మ కేవలం కళాకారుడు మాత్రమే కాదు, కూచిపూడికి నూతన శక్తి ప్రసాదించిన మహనీయ సంస్కృతి శిల్పి. అందుకే ఆయనను సంస్కృతిక లోకం "కూచిపూడికి జీవం పోసిన పురుషోత్తముడు"గా కీర్తించింది. వేదాంతం సత్యనారాయణ శర్మ జీవన కృషి ఒక కళాకారుని వ్యక్తిగత ప్రతిభకు మించినది; అది సంపూర్ణంగా కూచిపూడి నాట్య సంప్రదాయాన్నే ప్రపంచానికి పరిచయం చేసిన ఒక మహోన్నత సంస్కృతి యజ్ఞం. ఆయన వారసత్వం శాశ్వతం, ఆయన కీర్తి అమరత్వం.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బడి పలుకుల భాష కాదు.. బతుకు పలుకుబడుల భాష!

## తెలంగాణ భాష: సహజత్వానికి సజీవ సాక్ష్యం

### నేడు తెలంగాణ భాషా దినోత్సవం

**భాష అనేది కేవలం మానవ భావ వ్యక్తీకరణకు ఉపకరించే శబ్ద సముదాయం మాత్రమే కాదు; అది ఒక సమగ్ర జాతి సాంస్కృతిక జీవన విధానానికి సజీవ సాక్ష్యం, శతాబ్దాల చారిత్రక పరిణామాల దర్పణం. మనిషి పుట్టిన నేల స్వభావం, పీల్చిన గాలిలోని అనురాగం, సాగుచేసిన మట్టిలోని పరిమళం, శ్రమజీవుల స్వేదబిందువుల తడి, పోరాటాల సెగలు అన్నీ ఏకమై భాషకు ఒక నిర్దిష్టమైన జీవద్భావరూపాన్ని, తిరుగులేని ఆత్మగౌరవాన్ని ప్రసాదిస్తాయి. అందుకే తెలంగాణ భాష అనగానే కేవలం కొన్ని విలక్షణమైన యాస పదాలు, వ్యావహారిక శబ్దాల సమాహారంగా భావించడం చారిత్రక దృష్టిలో అసంపూర్ణమైన అవగాహన మాత్రమే అవుతుంది.**




తెలంగాణ పలుకుబడి శతాబ్దాల సామాజిక మథనం, శ్రమ సౌందర్యం, అన్యాయంపై ఎక్కుపెట్టిన ధిక్కార స్వరం, హాస్య చమత్కారాలు, అంతకుమించిన అమాయక ఆత్మీయతల పవిత్ర సంగమం. అలాంటి సజీవ ప్రజాభాషను గౌరవిస్తూ, తెలంగాణ ప్రజల గొంతుకకు అక్షరాలా రూపమిచ్చిన అక్షరయోధుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 9వ తేదీన 'తెలంగాణ భాషా దినోత్సవం'గా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకోవడం చారిత్రక ఔచిత్యం. 2014లో స్వయంపాలన సిద్ధించిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించగా, 2018లో దీనిని రాష్ట్రస్థాయి అధికారిక వేడుకగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తెలంగాణ మట్టి భాషకు రాజముద్రతో కూడిన సముచిత గౌరవం దక్కింది.

1914 సెప్టెంబర్ 9న కర్ణాటకలోని రట్టహళ్లిలో రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాజు కాళోజీ జన్మించినప్పటికీ, ఆయన బాల్యం, విద్యాభ్యాసం, చేతన, చింతన అంతా తెలంగాణ గడ్డపైనే ప్రాణం పోసుకున్నాయి. మడికొండ, వరంగల్, హైదరాబాద్ నగరాలలో సాగిన విద్యార్థి జీవితంలోనే ఆయన ప్రజాచైతన్యాన్ని పుణికి పుచ్చుకున్నారు. న్యాయవిద్యను అభ్యసించి నల్లకోటు ధరించినప్పటికీ, న్యాయస్థానపు నాలుగు గోడల మధ్య సంపన్నుల వివాదాలను పరిష్కరించడం కన్నా, నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న పీడిత ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను నిలదీయడానికే కాళోజీ జీవితాంతం అంకితమయ్యారు. ఆంధ్ర మహాసభ ఉద్యమం, గ్రంథాలయోద్యమం, రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం, భారత స్వాతంత్ర్యోద్యమం, ఆ తరువాతి ప్రత్యేక తెలంగాణ ప్రజా ఆకాంక్షల ఉద్యమాలలో కాళోజీ కలం నిరంతరం ప్రజల పక్షాన గర్జించింది. 'నా గొడవ' పేరుతో ఆయన రాసిన విస్తృత కవితా సంపుటాలు కేవలం కవిత్వ గ్రంథాలు కావు; అవి ఆనాటి సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక రుగ్మతలపై ఎక్కుపెట్టిన అక్షర తూటాలు. సంస్కృత భూయిష్టమైన కృత్రిమ పాండిత్య భాషను, ఛందోబద్ధ సంకెళ్లను తెంచుకుని, పల్లెటూరి మట్టిమనిషి నిత్యం మాట్లాడే పచ్చి పల్లె పలుకుబడినే సాహిత్య వేదికపై సగర్వంగా నిలబెట్టిన ఘనత కాళోజీకే దక్కుతుంది. 'భాష రెండు విధాలు– ఒకటి బడి పలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష; బడి పలుకుల భాష కన్నా పలుకుబడుల భాషే గొప్పది' అని కుండబద్దలు కొట్టిన కాళోజీ, సామాన్యుడి కన్నీటిని, చెమటను, నిరసనను, కోపాన్ని తన కవిత్వంలో కేంద్రబిందువుగా ప్రతిష్టించారు. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని నినదించి, యావజ్జీవితాన్ని ప్రజా సమస్యలకే ధారపోసి, మరణానంతరం కూడా తన పార్థివ దేహాన్ని వైద్య పరిశోధనల కోసం కాకతీయ వైద్య కళాశాలకు దానమిచ్చి మాటను చేతల్లో చూపిన అపురూప మానవతావాది కాళోజీ.

తెలంగాణ భాషా ప్రాచీనతను, గొప్పతనాన్ని అవగతం చేసుకోవాలంటే వేల ఏండ్ల సాహితీ చరిత్రను పునఃసమీక్షించుకోవాలి. క్రీస్తుపూర్వం శాతవాహనుల కాలం నాటి 'గాథాసప్తశతి' ప్రాకృత గ్రంథంలోనే అత్త, వదిన, పిల్ల, వోడ వంటి దేశి పదాలు విరివిగా కనిపించడం తెలంగాణ నేల భాషా ప్రాచీనతకు తిరుగులేని చారిత్రక నిదర్శనం. ప్రథమ తెలుగు పద్య శాసనంగా ప్రసిద్ధి చెందిన క్రీస్తుశకం 946 నాటి ధర్మపురి క్షేత్రం అగ్రహార దానం గురించి తెలిపే

కురిక్యాల శాసనాన్ని నిర్మించిన పంప మహాకవి సోదరుడు జినవల్లభుడు తెలంగాణ నేలపైనే కంద




పద్యాలకు ప్రాణం పోశాడు. పాల్కురికి సోమనాథుడు 12వ శతాబ్దంలోనే గంభీర సంస్కృత పదాల సంకెళ్లను తెంచి 'జానుతెనుగు'లో దేశి ద్విపద కావ్యాలు రచించి 'ఒగి నెల్ల యెడల దేశీయ పదముల జానుదెనుగున' అంటూ సామాన్యుల భాషకు కావ్యగౌరవాన్ని కల్పించాడు. మల్లికార్జున పండితారాధ్యుడు, కాకతీయుల కాలం నాటి శివకవులు, బమ్మెర పోతన, గోల్కొండ కవుల వరకు ఈ నేల సహజ దేశీయ పదసంపదతో పరవళ్లు తొక్కింది. ఆ తదనంతర చారిత్రక పరిణామాలలో బహమనీలు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల సుదీర్ఘ పాలన ప్రభావంతో తెలుగు భాష పరిధి విస్తృతమై ఉర్దూ, దఖనీ, మరాఠీ, కన్నడ, పారశీక భాషల పదాలు సహజంగా తెలుగులో కలగలిసి పోయాయి. తెలంగాణ ప్రజలు ఆ పదాలను యథాతథంగా స్వీకరించక, తమ నాలుకలకు అనువైన రీతిలో, తమ వ్యాకరణానికి ఒదిగేలా 'స్వదేశీకరించుకుని' సొంతం చేసుకున్నారు. ఆ విధంగా రూపుదిద్దుకున్న భాషా సంపద ఎన్నటికీ కలుషితం కాదు; విభిన్న సంస్కృతుల కలయికతో ఏర్పడిన అద్భుతమైన చారిత్రక సమన్వయ సంపద.

'అయ్యా', 'బాబూ', 'ఎట్లున్నావ్', 'ఏమాయె', 'బిడ్డా', 'నయంగున్నదా', 'పోతన్నావా', 'వస్తన్నావా' వంటి వాత్సల్యభరిత పలుకుబడులు, 'అవ్వ', 'తాత', 'బావ', 'అన్న', 'అక్క' వంటి సంబోధనల్లోని అనురాగం తెలంగాణ సంభాషణలకు ప్రత్యేకమైన మాధుర్యాన్నిస్తాయి. మాటలో మమకారం, పలుకులో పరిమళం, పిలుపులో ప్రాణం నింపడం తెలంగాణ భాష సహజ లక్షణం. శ్రామిక జీవులు పాడుకునే జాజర పాటలు, వరికోత పాటలు, బతుకమ్మ ఉత్సవాలలో స్త్రీల గొంతుల్లో పలికే ఆత్మీయ నివేదనలు, ఒగ్గుకథలు, బాలల కథలు, బుర్రకథలు, చిందు భాగవతాలు, కొమురవెల్లి మల్లన్న పట్నాలు, గిరిజనుల గోండు, కోయ మౌఖిక గాథలు ఈ భాషా సౌందర్యానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. ప్రతి పల్లె పదంలోనూ ఒక శాస్త్రీయత, జీవన అనుభవం, ప్రకృతితో మమేకమైన విజ్ఞానం దాగి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఉమ్మడి పాలన కాలంలో ఈ సజీవ భాషను సరైన అవగాహన లేకుండా 'యాస' అని, వ్యాకరణ విరుద్ధమని, సంస్కారహీనమని హేళన చేసిన చారిత్రక దుస్థితి నెలకొంది. ఏ భాషాశాస్త్రమైనా నిరూపించే ప్రాథమిక సత్యం ఏమిటంటే–భూగోళంపై ఏ భాషకైనా నికరమైన ప్రామాణికత అనేది కేవలం ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం కాదు; ప్రతి ప్రాంతీయ మాండలికానికి దానిదైన శబ్ద పరిణామ సూత్రాలు, ధ్వని సౌందర్యం, వాక్య నిర్మాణం, నుడికారపు గాఢత ఉంటాయి. ప్రామాణిక గ్రంథస్థ భాష పరిపాలనకు, నిఘంటువులకు ప్రతీకైతే, మట్టిభాష ప్రజల నిత్య చైతన్యానికి శ్వాస వంటిది. రెండూ ఒకే తెలుగు భాషా వృక్షానికి ఉన్న రెండు బలమైన కొమ్మలు తప్ప పరస్పర విరుద్ధాలు కావు. ఒకదాని వైభవాన్ని చాటడానికి మరొకదానిని కించపరచాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు.

జాతీయ స్థాయిలో భాషా గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే భారత జనగణన వివరాల ప్రకారం తెలుగు దేశంలోనే అత్యధికులు మాట్లాడే ప్రాచీన, అగ్రగామి ద్రావిడ భాషలలో ఒకటిగా భాసిల్లుతోంది. దేశవ్యాప్తంగా 8 కోట్లకు పైగా ప్రజలకు తెలుగు మాతృభాషగా ఉండగా, తెలుగు మాట్లాడే సమాజాలు కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితం కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల్లోను, ఖండాంతర దేశాల్లోను విస్తరించి ఉన్నాయి.

జనగణన నివేదికలు స్పష్టం చేస్తున్నట్లుగా బహుభాషా సంస్కృతి ప్రజలను వేరుచేసే గోడ కాదు, విభిన్న జనసమూహాలను అనుసంధానించే సాంస్కృతిక వారధి. తెలంగాణ సమాజం శతాబ్దాలుగా బహుభాషలను తనలో ఇముడ్చుకుంటూనే తన ప్రత్యేక అస్తిత్వాన్ని, సహజత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే సెప్టెంబర్ 9న భాషా దినోత్సవం జరుపుకోవడం అంటే కేవలం కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడమో, సాంస్కృతిక సభల్లో ప్రసంగాలు దంచడమో లేదా కవి సమ్మేళనాలు నిర్వహించడమో మాత్రమే కాకూడదు. ఒక భాష దీర్ఘకాలం వర్ధిల్లాలంటే అది పరిపాలనా దస్త్రాలలో మాత్రమే కాక, ప్రజల నిత్య వ్యవహారంలో జీవించాలి; పసిపిల్లల ఆటపాటల్లో ప్రతిధ్వనించాలి; ఇంటి ముంగిళ్లలో ఆత్మీయంగా వినిపించాలి; పాఠశాల తరగతి గదుల్లో సంకోచం లేకుండా గౌరవించ బడాలి; సాహిత్య సృజనలో విస్తరించాలి; సినిమా, నాటక, డిజిటల్ మాధ్యమాలలో సహజ నైజంతో ఆవిష్కృతమవ్వాలి.

ఈ క్రమంలో మన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ లోకానికి అత్యంత గురుతరమైన బాధ్యత ఉంది. పాఠశాలలకు వచ్చే గ్రామీణ, బడుగు వర్గాల పిల్లలు తమ సహజమైన తెలంగాణ మాండలికంలో మాట్లాడినప్పుడు 'ఇది అశుద్ధమైన యాస, ఇలా మాట్లాడకూడదు' అని దండించడం లేదా హేళన చేయడం వారిలోని ఆత్మస్థైర్యాన్ని, సృజనాత్మకతను నిర్దాక్షిణ్యంగా దెబ్బతీస్తుంది. ప్రామాణిక తెలుగులోని రచనా నియమాలను విద్యార్థులకు నేర్పిస్తూనే, వారి ఇంటి భాషను, ప్రాంతీయ నుడికారాన్ని ఆత్మీయంగా గౌరవించే సున్నితమైన బోధనా పద్ధతులు విస్తృతంగా అమలులోకి రావాలి. మాతృభాషపై పరిపూర్ణమైన ప్రేమ, పట్టు ఉన్నప్పుడే ఇతర ప్రపంచ భాషలను సులువుగా నేర్చుకోగల బహుభాషా విజ్ఞానం పెంపొందుతుంది. ఆధునిక ప్రపంచీకరణ, విపరీత పట్టణీకరణ, ఆంగ్ల మాధ్యమ వ్యామోహం, డిజిటల్ సంక్షిప్త సందేశాల యుగంలో అన్ని ప్రాంతీయ మాతృభాషలు పెను సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణమిది. ఉపాధి కోసం ఆంగ్లం, జాతీయ స్థాయి అవసరాల కోసం హిందీ లేదా ఇతర భాషలు నేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికీ, వాటి కోసం స్వంత భాషను విస్మరించడం ఆత్మహత్యా సదృశం. లోకాన్ని జయించడానికి ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు గానీ, మన మూలాలను, మన సాంస్కృతిక అస్తిత్వాన్ని గుర్తించడానికి, అంతరంగాన్ని నిష్కల్మషంగా వ్యక్తీకరించడానికి మాతృభాష ఒక్కటే అసలైన సాధనం.

తెలంగాణ నేల భాషను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడానికి సమష్టి కార్యాచరణ అత్యవసరం. పల్లెల్లో అంతరించిపోతున్న వ్యవసాయ, చేతివృత్తుల, జీవన అనుబంధ అపురూప పదజాలాన్ని పండితులు, పరిశోధకులు క్షేత్రస్థాయికి వెళ్లి శాస్త్రీయంగా నమోదు చేయాలి. వృద్ధుల నోటి నుంచి జాలువారే సామెతలు, పొడుపు కథలు, వైద్య విధానాలు, జానపద కథాగేయాలను ఆధునిక డిజిటల్ శ్రవ్య–దృశ్య రూపాల్లో భాండాగారాలుగా భద్రపరచాలి. తెలంగాణలోని అన్ని జిల్లాల మాండలిక పదకోశాలను, వృత్తి పదకోశాలను విశ్వవిద్యాలయాలు ప్రతిష్టాత్మకంగా రూపొందించాలి. నేటి ఆధునిక సాంకేతిక విప్లవంలో భాగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సహజ భాషా విశ్లేషణ (ఎన్‌ఎల్‌పీ), వాయిస్ రికగ్నిషన్, స్వయం అనువాద సాఫ్ట్‌వేర్లలో తెలంగాణ విలక్షణ పదసంపదకు, ఉచ్చారణా శైలికి తగిన స్థానం కల్పించేలా సాంకేతిక పరిశోధనలు ముమ్మరం కావాలి. నవతరం రచయితలు, కళాకారులు తెలంగాణ జీవితాన్ని కృత్రిమత్వం లేకుండా తెలంగాణ పలుకుబడితోనే నవ్య సాహిత్యంగా ఆవిష్కరించాలి. పత్రికలు, దృశ్యమాధ్యమాలు ఈ భాషను కేవలం హాస్యానికి మాత్రమే పరిమితం చేయకుండా గంభీర విశ్లేషణలకు, సంపాదకీయాలకు సైతం సమర్థవంతంగా వినియోగించాలి.

భాషను బతికించేది కేవలం ప్రభుత్వ ఉత్తర్వులో, తాత్కాలిక సభాప్రాంగణాలో కావు; సమాజం తన భాష పట్ల ప్రదర్శించే నిరంతర స్వాభిమానం, ఆచరణాత్మక వినియోగం మాత్రమే దానిని సజీవంగా ఉంచుతాయి. ఒక మనిషి తన తల్లి ప్రేమామృతాన్ని ఎలా మరచిపోలేడో, ఒక సమాజం తన పురిటిగడ్డ భాషను అలా విస్మరించకూడదు. భాషను కాపాడుకోవడం అంటే ప్రాచీన అక్షరాలను భద్రపరచడం మాత్రమే కాదు; ఆ పదాల మాటున తరతరాలుగా నిక్షిప్తమై ఉన్న ఆచార వ్యవహారాలను, పోరాట వీరత్వాన్ని, త్యాగాలను, కన్నీటి గాథలను, జీవన మూలాలను కాపాడుకోవడమే. 'మాట మనది, మట్టి మనది, మనుగడ మనది' అనే ప్రగాఢ ఆత్మవిశ్వాసంతో తెలంగాణ పలుకుబడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ప్రపంచ భాషా వేదికలపై సగర్వంగా నిలబెట్టడమే కాళోజీ నారాయణరావుకు మనం అర్పించే నిజమైన నివాళి, తెలంగాణ భాషా దినోత్సవానికి నిండైన సార్థకత.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# భారత్ ను చూసి నేర్చుకోండి

**ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన**

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.



# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖురైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.

# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన





ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది. మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

# రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..






ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



### అనస్వర రాజన్‌కు పుట్టినరోజు కానుక..

## 'కాకా'లో అమ్ములుగా ఫస్ట్ లుక్

మలయాళ నటి అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్ర బృందం ప్రత్యేక కానుకను అందించింది. సినిమాలో ఆమె పోషిస్తున్న 'అమ్ములు' పాత్రకు సంబంధించిన తొలి రూపాన్ని విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనస్వర రాజన్ వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థినిగా ఎంతో సహజమైన, ఇంటి అమ్మాయి తరహా రూపంలో కనిపిస్తోంది. ఈ లుక్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కాకా'లో అనస్వర రాజన్ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఆమె మెగాస్టార్ చిరంజీవికి కూతురిగా కనిపించనుంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న అనుబంధం కథలో కీలకంగా ఉండటమే కాకుండా, చిత్రానికి ప్రధాన భావోద్వేగ అంశంగా నిలవనుందని తెలుస్తోంది. అమ్ములు జీవితంలో తండ్రి పాత్ర ఎంత ముఖ్యమైనదో తెలియజేసేలా తొలి పోస్టర్‌ను కూడా ఆసక్తికరంగా రూపొందించారు. పోస్టర్‌లో చిరంజీవి ముఖాన్ని చూపించకుండా ఆయన నీడను మాత్రమే ఆవిష్కరించారు. దీంతో అమ్ములు పాత్రకు, ఆమె తండ్రికి మధ్య ఉన్న అనుబంధంపై మరింత ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలతో పోలిస్తే ఈ పోస్టర్ కథలోని కుటుంబ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉండబోతుందనే సంకేతాన్ని ఇస్తోంది. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని కెవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. చిరంజీవి, అనస్వర రాజన్ కలయికలో తండ్రీకూతుళ్ల అనుబంధాన్ని తెరపై ఎలా ఆవిష్కరించబోతున్నారనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. 'కాకా' చిత్రాన్ని 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. చిరంజీవి, బాబీ కొల్లి కలయికపై భారీ అంచనాలు ఉండటంతో పాటు, ఇప్పుడు అనస్వర రాజన్ పాత్ర కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రం కోసం మెగా అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## 'ది పారడైజ్'పై క్లారిటీ.. వాయిదా లేదు

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'ది పారడైజ్'. 'దసరా' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోగా.. 'యేషనాగుల', 'ఆయా షేర్' వంటి పాటలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఇక అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమా వాయిదా పడుతుందంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పలు వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం మరోసారి విడుదల తేదీపై స్పష్టత ఇచ్చింది. 'డౌటే వద్దు.. వాయిదా లేదు.. సెప్టెంబర్ 24న వస్తున్నాం' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి పుకార్లకు చెక్ పెట్టింది. దీంతో సినిమా వాయిదాపై వస్తున్న వార్తలకు తెరపడినట్లైంది. ఈ ప్రకటనతో నాని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో కయాదు లోహార్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కుల్కర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## డూప్ లేకుండా భారీ స్టంట్ చేసిన మాళవిక మోహనన్

కార్తి హీరోగా పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. షూటింగ్ తొలిరోజే రోప్‌ల సాయంతో భారీ ఎత్తు నుంచి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకే సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేసింది. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్‌లో శిక్షణతో పాటు 'తంగలాన్' కోసం సిలంబం నేర్చుకోవడం తనకు ఈ సన్నివేశంలో ఉపయోగపడిందని తెలిపింది. యాక్షన్ సన్నివేశాల్లో నటన సహజంగా ఉండేలా సీనియర్ నటుడు విక్రమ్ ఇచ్చిన సలహా తనకు ఎంతో ఉపయోగపడిందని మాళవిక చెప్పింది. అలాగే సినిమాలో విలన్‌గా నటిస్తున్న ఎస్.జె. సూర్య నటన తనను ఎంతగానో స్ఫూర్తి చేసిందని, అవకాశం వస్తే భవిష్యత్తులో శక్తివంతమైన ప్రతినాయకురాలి పాత్రలు చేయడానికి సిద్ధమని వెల్లడించింది. కార్తి చాలా సరదాగా, మంచి మనసుతో ఉంటారని ప్రశంసించిన మాళవిక.. 'సర్దార్ 2'లో అద్భుతమైన దృశ్యాలు, భారీ యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను అలరిస్తాయని చెప్పింది. బ్యాంకాక్‌లోనూ కీలక పోరాట సన్నివేశాలను చిత్రీకరించిన ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఫౌజీ షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్..

సినిమా డెస్క్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలోనే హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు సంబంధించిన సుమారు 20 రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'సలార్ 2'తో పాటు 'ఫౌజీ' షూటింగ్‌లలో పాల్గొంటున్నాడు. వరుస చిత్రీకరణల కారణంగా 'ఫౌజీ'కి సెప్టెంబర్ 15 వరకు విరామం ఇచ్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత మిగిలిన షూటింగ్‌ను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే చిత్రీకరణకు విరామం ఉన్నప్పటికీ నిర్మాణానంతర పనులు మాత్రం వేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా భారీ యాక్షన్ సన్నివేశాలకు సంబంధించిన దృశ్య ప్రభావాల పనులను అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థలు చేపట్టినట్లు సమాచారం. సినిమాను భారీ స్థాయి దృశ్య వైభవంతో తెరకెక్కించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే 'ఫౌజీ' షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ప్రభాస్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పీరియాడిక్ నేపథ్యానికి యాక్షన్ అంశాలను జోడిస్తూ హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రభాస్‌ను సరికొత్త కోణంలో చూపించనుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు





## చీరకట్టులో మెరిసిన వైష్ణవి చైతన్య.. ఆకట్టుకుంటున్న లుక్

సినిమా డెస్క్: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఇప్పటికే మంచి ప్రచారం లభిస్తోంది.

తాజాగా జరిగిన సినిమా ముందస్తు విడుదల వేడుకలో వైష్ణవి చైతన్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ చీరకట్టులో వేడుకకు హాజరైన ఆమె అందంగా ముస్తాబై సందడి చేసింది. చీరలో వైష్ణవి చైతన్య లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు మంచి స్పందన రావడంతో 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'పై ఆసక్తి పెరిగింది. 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి జంటగా నటించడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644